ప్రజాశక్తి

ఆదివారం 6 ఆగస్టు 2023

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

తర్లువాడ కొండపై విజయసాయిరెడ్డి కన్ను ?

◆ రహస్య సర్వేలు ◆ స్థానిక నేతలనూ పైకి రానివ్వని ఎంపీ ◆ గ్రామస్తుల్లో తీవ్ర చర్చ

ప్రజాశక్తి - ఆనందపురం : మండలంలోని తర్లువాడ పంచాయతీ పరిధి సర్వే నెంబర్1లో దేవుడమ్మ కొండను వైసిపి రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి ఆకస్మికంగా శనివారం సందర్శించడం పలు అనుమానాలకు తావిస్తోంది. కనీసం స్థానిక నాయకులకు కూడా సమాచారం ఇవ్వకుండా ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకూ కొండపైనే ఉండి రహస్య మంతనాలు సాగించారు. స్థానిక సచివాలయ సర్వేయర్ ప్రసాద్‌ను సర్వే వివరాలు అడిగి తెలుసుకున్నారు. విజయసాయిరెడ్డి వచ్చిన విషయం తెలుసుకున్న స్థానిక ఎంపిపి, స్థానిక సర్పంచ్ బిఆర్‌బి.నాయుడు, మరి కొంతమంది నాయకులు ఆయనను కలవడానికి ప్రయత్నిస్తే ఆయన రావొద్దన్నారు. దీంతో కొండ కిందనే వారంతా ఉండిపోవాల్సి వచ్చింది. కొద్దిసేపటికి విషయం తెలుసుకున్న స్థానిక ప్రజలు కొండ ప్రాంతానికి చేరుకోగా వారి రాకను గమనించి విజయసాయిరెడ్డి బృందం అక్కడి నుంచి వెళ్లిపోయింది.



కొండ దిగువున ఉన్న విజయసాయిరెడ్డి వాహనాలు

ఇక్కడ కొండపైన సుమారు మిగతా 2లో..

9 నుంచి సిజిఆర్ఎఫ్ సదస్సులు

ప్రజాశక్తి - విశాఖపట్నం : ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఎపిఇపిడిసిఎల్) పరిధిలోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, రాజమండ్రి, ఏలూరు సర్కిళ్లలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 9 నుంచి సదస్సులు నిర్వహిస్తున్నట్లు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సిజిఆర్ఎఫ్) ఛైర్మన్, విశ్రాంత జడ్జి బి.సత్యనారాయణ తెలిపారు. శ్రీకాకుళం సర్కిల్ సదస్సు శ్రీకాకుళం రూరల్ సబ్ డివిజన్‌లో ఈ నెల 9న, విశాఖపట్నం సర్కిల్ సదస్సు యలమంచిలి సబ్ డివిజన్‌లో 11న, విజయనగరం సర్కిల్ సదస్సు పార్వతీపురం సబ్ డివిజన్‌లో 18న, రాజమండ్రి సర్కిల్ సదస్సు జగ్గంపేట డివిజన్ ప్రత్తిపాడు సబ్ డివిజన్‌లో 22న, ఏలూరు సర్కిల్ సదస్సు మిగతా 2లో..

కేంద్ర విధానాలపై / 9న విశాఖలో 'క్విట్ మోడీ'

ప్రభుత్వ రంగ సంస్థల రక్షణే లక్ష్యంగా కార్మికవర్గం సన్నద్ధం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ప్రజా, కార్మిక ఉద్యమ కేంద్రమైన విశాఖ నగరంలో ఈ నెల 9న 'క్విట్ మోడీ' నినాదంతో కేంద్రంలోని బిజెపి విధానాలపై కార్మికవర్గం పోరాటానికి సన్నద్ధమైంది. మోడీ పాలనతో దేశంలో అన్ని రంగాలూ కుదేలై ప్రజల జీవనం చిన్నాభిన్నమవడం, ప్రభుత్వ రంగ సంస్థలు ధ్వంసం కావడం అందరికీ తెలిసిందే. ఈ తరుణంలో ఈ పాలనను సహించలేని ప్రజానీకాన్నంతా ఏకం చేసే దిశగా సిఐటియూ విశాఖ జిల్లా కమిటీ కృషి సలుపుతోంది. దేశ స్వాతంత్ర్యం కోసం బ్రిటిష్ వారిని తరిమికొట్టేందుకు 1942 ఆగస్టు 9న జరిగిన క్విట్ ఇండియా స్ఫూర్తితో తాజాగా మోడీ చేస్తున్న విధ్వంస పాలనపై సిఐటియు తిరుగుబావుటా ఎగరవేయనుంది. విశాఖ నగరంలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద మోడీ విధ్వంస పాలనకు వ్యతిరేకంగా మహా ధర్నా కార్యక్రమానికి ఆ సంఘం ఇప్పటికే పిలుపునిచ్చింది. ప్రభుత్వ రంగ సంస్థలపై కక్ష కట్టి వ్యవహరిస్తున్న కేంద్ర విధానాలపై ఇప్పటికే విశాఖ నగర వాసులు, కార్మికులు విసిగివేసారిపోయారు. స్టీల్‌ప్లాంట్, షిప్‌యార్డు, రైల్వే వంటి కీలక సంస్థల్లో ఉన్నతాధికారులు సైతం మోడీ విధానాలపై అంతర్గతంగా తీవ్ర మదనపడుతూ విధులు నిర్వహిస్తున్నారు. గతంలో వాల్తేరు రైల్వే డిఆర్ఎంలుగా పనిచేసిన అధికారులు సైతం దేశంపై ప్రధాని మోడీ విజన్ ఎంత మాత్రం సరిగా లేదని, ప్రాజెక్టులేవీ రైల్వేకు రావడం లేదని, రైల్వే జోన్ ప్రకటించినా ఎప్పుడు పనులు చేపడతారో ఢిల్లీ నుంచి కింది వరకూ ఎవ్వరికీ అర్థం కాని దుస్థితి ఉందని వ్యాఖ్యానించడం తెలిసిందే. రైల్వేలకు చెందిన ఉన్నతాధికారులైతే బాహాటంగానే వాల్తేరు రైల్వే డివిజన్ ఎత్తేసి విశాఖ ఆర్థిక రంగంపై దెబ్బతీసే పరిస్థితిపై గళమెత్తారు. ఇంత కక్షపూరిత పాలన తామెన్నడూ చూడలేదంటూ తాజాగా వ్యాఖ్యానిస్తున్నారు. ప్రధానంగా రైల్వే రంగంపై అన్ని రకాలుగా తన విధానాలతో మిగతా 2లో..

టిడ్కో ఇళ్లను తక్షణమే పంపిణీ చేయాలి : సిపిఎం

▶ వార్త 8లో..

ఘనంగా ఐలు జిల్లా మహాసభ

▶ వార్త 4లో..





మాట్లాడుతున్న తనూజా రెడ్డి

బిల్డర్లు అక్రమాలకు పాల్పడితే భారీగా జరిమానాలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : నగరంలో బిల్డర్స్ చేస్తున్న అక్రమాలపై ఇటీవల ఫిర్యాదులు అధికంగా వస్తున్నాయని కన్జ్యూమర్స్ కౌన్సిల్ జిల్లా కమిషన్-1 తనూజా రెడ్డి అన్నారు. విశాఖ కన్జ్యూమర్ కౌన్సిల్ గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు శనివారం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిల్డర్లు ఫ్లాట్స్ అమ్మేటప్పుడు చెబుతున్న సౌకర్యాలను కల్పించడంలోనూ, సకాలంలో నిర్మాణాలు చేయకపోవడంతోనూ ఫ్లాట్స్ నిర్మాణంలో పలు డివియేషన్స్ ఉంటున్నాయన్నారు. లక్షలు, కోట్లు వెచ్చించి చేస్తున్న నిర్మాణాలలో కొనుగోలుదారులు నష్టపోకూ మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

9న విశాఖలో 'క్విట్ మోడీ'

మోడీ దాడిని ఎక్కుపెట్టాడు. లక్షల సంఖ్యలో ఉద్యోగ ఖాళీలున్నా భర్తీ చేయకుండా కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో వెళుతూ దేశీయ రైల్వే రంగం కునారిల్లేలా విధానం తీసుకున్నాడు. సామాన్య ప్రజలను చౌకగా తమ గమ్యస్థానాలకు చేర్చే రైల్వేకు పెద్ద జంక్షన్ అయిన విశాఖపట్నంలో పలు కీలక విభాగాలు ఉన్నాయి. ఇఎల్ఎస్, డిఎల్ఎస్ (డీజిల్, ఎలక్ట్రికల్ లోకోషెడ్లు) బ్రిటిష్ కాలం నాటివి. వీటిపైనా మోడీ విధానాల ప్రభావం ఉంది. దేశంలో రైల్వే ప్లాట్‌ఫారాలను, స్థలాలను లీజు పేరుతో చాపచుట్టేసి కార్పొరేట్లకు కట్టబెట్టే పథకం ఇప్పటికే నడుస్తోంది. వాస్తవానికి రైల్వే జోన్ వస్తే తప్ప విశాఖ రైల్వే అభివృద్ధి సాధ్యపడదు. ఈ విషయం తెలిసినా కేంద్రంలోని మోడీ సర్కారు దక్షిణ కోస్తా రైల్వే జోన్ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఈ ప్రాంత ప్రజలు, కార్మికులు, ఉద్యోగుల ఆశలను చిదిమేస్తూ వస్తోంది. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ఎలాగైనా ప్రైవేటీకరణ చేసి తీరుతామంటూ కేంద్ర పాలకులు పట్టుబట్టి కూర్చొనడంతో 900 రోజులకు పైగా కార్మికవర్గం ఉక్కు పరిరక్షణ పోరాటం సలుపుతోంది. ఓ వైపు కార్మికులు విధులకు హాజరవుతూనే, మరోవైపు స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకోడానికి ఉద్యమాన్ని కొనసాగిస్తున్నారు. మోడీ చర్యలతో దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలన్నీ దివాలా దశలో కొట్టుమిట్టాడుతున్న తరుణంలో ఆగస్టు 9న విశాఖలో క్విట్ మోడీ నినాదంతో పెద్ద ఉద్యమానికి కార్మికులు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే స్టీల్‌ప్లాంట్ వంటి చోట్ల సన్నద్ధ సమావేశాలు జోరందుకున్నాయి.

9 నుంచి సిజిఆర్ఎఫ్ సదస్సులు

జంగారెడ్డిగూడెం డివిజన్‌లోని కామవరపుకోట సబ్ డివిజన్ కార్యాలయంలో 23న ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరుగుతాయన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, హెచ్చుతగ్గులు, బిల్లుల సమస్యలు, కొత్త సర్వీసుల జారీ, పేరుమార్పిడి, విద్యుత్ సరఫరా పునరుద్ధరణలో జాప్యం, ట్రాన్స్ ఫార్మర్ల మార్పిడి, తదితర విద్యుత్ సంబంధిత సమస్యలపై వినియోగదారులు ఈ సదస్సుల్లో సిజిఆర్ఎఫ్ కమిటీకి తెలియజేయాలన్నారు. విశాఖపట్నం సీతమ్మధారలోని ఎపిఇపిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయ ఆవరణలోని సిజిఆర్ఎఫ్ కార్యాలయంలో లిఖిత పూర్వకంగానూ ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. వినియోగదారుల సమస్యలను పరిశీలించి, విచారణ జరిపి న్యాయం చేస్తామని పేర్కొన్నారు. ఈ సదస్సుల్లో చైర్మన్ బి.సత్యనారాయణతో పాటు సిజిఆర్ఎఫ్ కమిటీ సభ్యులు ఎస్.హరిబాబు, డాక్టర్ రాయసం సురేంద్ర కుమార్ హాజరవుతారని తెలిపారు.

తర్లువాడ కొండపై విజయసాయిరెడ్డి కన్ను?

వెయ్యి ఎకరాల స్థలంపై విజయసాయిరెడ్డి కన్ను పడినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కొండపైన పది ఎకరాలను హైస్కూల్‌కు, ఆరున్నర ఎకరాలను వెంకటేశ్వర దేవాలయానికి, 30 ఎకరాలను ఫారెస్ట్ అధికారులకు కేటాయించినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ కొండపైన ఇటీవల తాత్కాలిక రోడ్డు ఏర్పాటు చేసి కొంత స్థలాన్ని చదును చేశారు. ఆ స్థలంలో చర్చి కట్టడానికి విజయసాయిరెడ్డి రహస్య మంతనాలు జరుపుతున్నారేమోనని గ్రామస్తులు అనుమానం చేస్తున్నారు. స్థానిక నాయకులనూ రానివ్వకుండా కొండపైన రెండు గంటల పాటు రహస్య సర్వేలు చేయడంపై స్థానికుల్లో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ఇదిలా ఉండగా స్థానిక విలేకరులు విజయసాయిరెడ్డిని కలవడానికి ప్రయత్నించగా ఆయన కారు దిగకుండా వెళ్లిపోయారు.

బిల్డర్లు అక్రమాలకు పాల్పడితే భారీగా జరిమానాలు

డదన్నారు. అందుకే ఇటువంటి ఫిర్యాదుల విషయంలో అక్రమాలకు పాల్పడే బిల్డర్స్‌కు భారీగా జరిమానాలు విధిస్తున్నామని చెప్పారు. అలాగే ఎలక్ట్రికల్ గూడ్స్ విషయంలోనూ అధికంగా ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. రిఫ్రిజిరేటర్స్, ఏసీలు, ఇతర ఎలక్ట్రికల్ గూడ్స్‌పై విక్రయాలలో అధికంగా మోసాలు ఉంటున్నాయన్నారు. కొనుగోలుదారులు అన్ని జాగ్రత్తలూ తీసుకుంటే సమస్యలు రావన్నారు. కౌన్సిల్ చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలమోహన దాస్ మాట్లాడుతూ కన్జ్యూమర్ కౌన్సిల్ చట్టం రాకముందే విశాఖ నగరంలో విశాఖ కన్జ్యూమర్స్ కౌన్సిల్ ప్రారంభించబడి 50 ఏళ్ల పాటు దిగ్విజయంగా నడుస్తోందని చెప్పారు. వినియోగదారుల హక్కుల గురించి ఇటీవల ప్రజల్లో కొంత చైతన్యం వచ్చిందన్నారు. కౌన్సిల్ కార్యదర్శి డాక్టర్ పి.రామారావు మాట్లాడుతూ తమ కౌన్సిల్ ఇతోధికంగా సేవలు అందిస్తోందని తెలిపారు. కన్జ్యూమర్స్ కౌన్సిల్ గౌరవాధ్యక్షురాలు విమల కుమారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి జి.సూర్యప్రకాశరావు, న్యాయవాదులు పికె.పద్మ, రమణి పాల్గొన్నారు.

విద్యాసంస్థల్లో సనాతన ధర్మమా?

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో : పాఠశాలలు, కళాశాలల్లో సనాతన ధర్మ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్న దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ప్రకటనను జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి జి.మురళీధర్ శనివారం ఒక ప్రకటనలో ఖండించారు. ఆర్టికల్ 51ఎహెచ్ ప్రకారం శాస్త్రీయ దృక్పథాన్ని పెద్ద ఎత్తున ప్రజల్లో, విద్యార్థుల్లో ప్రచారం చేయాలని భారత రాజ్యాంగం ఘోషిస్తుంటే అదే రాజ్యాంగం మీద ప్రమాణం చేసిన రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి దానికి భిన్నంగా వ్యవహరించడం చట్ట విరుద్ధమన్నారు, తక్షణం మంత్రి తన నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సిఎంఆర్ సెంట్రల్‌లో హీరో జెడి చక్రవర్తి సందడి


ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : డిస్నీ హాట్ స్టార్‌లో శుక్రవారం విడుదలై ప్రేక్షక ఆదరణ పొందుతున్న వెబ్ సిరీస్ ప్రచార కార్యక్రమంలో భాగంగా శనివారం సాయంత్రం విశాఖపట్నంలోని సిఎంఆర్ సెంట్రల్‌లో హీరో జెడి చక్రవర్తి సందడి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన కెరీర్‌లో ఇది మొట్టమొదటి వెబ్ సిరీస్ అని తెలిపారు.

కదిలించిన పోరాటాలు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

'పాడేరు ఘాట్‌రోడ్ దిగిన తరువాత నుంచి మాడుగుల మీదుగా విశాఖపట్నం వచ్చే రోడ్డులో కారు ప్రయాణమంటే భయమేస్తోంది. రోడ్డు గురించి ఎవరైనా అడుగుతారేమోనని నేమ్ బోర్డు తీసి కారులో పెట్టుకొని ప్రయాణం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది' - అని గత నెల 27న జరిగిన జిల్లా పరిషత్ స్థాయీ సంఘం సమావేశంలో జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ జె.సుభద్ర ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టరేట్‌లో జరిగిన మాడుగుల నియోజకవర్గ సమీక్ష సమావేశంలో ఉపముఖ్యమంత్రి, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడు తన మాడుగుల నియోజకవర్గంలో రహదారుల పరిస్థితి వివరించి, రోడ్లు బాగోలేక జనం బూతులు తిడుతున్నారని, నియోజకవర్గంలో తిరగలేకపోతున్నామని మనస్తాపం చెందారు. యలమంచిలి నియోజకవర్గంలోని అచ్యుతాపురం, అనకాపల్లి రహదారి విస్తరణ పనులు జరగని విషయాన్ని ఎమ్మెల్యే రమణమూర్తిరాజు నియోజకవర్గ సమీక్షలో ఉపముఖ్యమంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి రాజన్నదొర ముందు ప్రస్తావిస్తూ తన గోడు వెళ్లబోసుకున్నారు. వారెంత గగ్గోలు పెట్టినా ఫలానా ఇన్ని రోజులకు ఈ పని చేస్తామని సంబంధిత అధికారులేమీ హామీ ఇవ్వలేదు. ప్రజా ప్రతినిధులు హామీని పొందలేకపోయారు.

అదే సమయంలో నాన్‌షెడ్యూల్ గిరిజన సంఘం నేతృత్వంలో కోటవురట్ల మండలం గొట్టివాడ పంచాయతీ అణుకు గిరిజన గ్రామంలో పాఠశాల ఏర్పాటు చేయాలని, రోడ్డు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని గిరిజనులు జులై ఏడు నుంచి చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు కొన్ని విజయాలు సాధించగలిగాయి. ఏ ప్రభుత్వాలూ, ప్రజా ప్రతినిధులూ సాధించలేని, చేయలేని పనులను పోరాటాలతో గిరిజనులు సాధించుకున్నారు. పాఠశాలలేని ఆ గ్రామానికి నాన్ రెసిడెన్షియల్ స్పెషల్



ట్రైనింగ్ సెంటర్ (ఎన్ఆర్ఎస్‌టిసి) కింద పాఠశాల మంజూరైంది. అంత్యోదయ కార్డులు మంజూరుపై హామీని పొందారు. ఇంకా రహదారి, మౌలిక సదుపాయాలు కల్పన పనులు జరగాల్సివుంది. ప్రజల పోరాటానికున్న శక్తి ఎలాంటిదో అణుకు ఆదివాసీలు రుజువుచేశారు. అడ్డురోడ్డు నుంచి నర్సీపట్నం రోడ్డు అత్యంత ఘోరంగా వుంది. ఈ రోడ్డు మరమ్మతులు చేపట్టకపోవడంతో ప్రజల బాధలను గుర్తించిన సిపిఎం మరమ్మతులు పనులు చేపట్టాలని అడ్డురోడ్‌లో రాస్తారోకో చేపట్టింది. వెంటనే ప్రభుత్వ యంత్రాంగం కదిలింది. వారం రోజుల్లో మరమ్మతులు చేపడతామని ఆర్ అండ్ బి శాఖాధికారులు హామీ ఇచ్చారు. జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్, మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా పనులు చేయించుకోలేక చతికిలపడ్డ పాలక ప్రభుత్వంలో ప్రజా పోరాటాలతో ప్రజల సమస్యలను సిపిఎం, ప్రజా సంఘాలు పరిష్కరించుకోగలుగుతున్నాయి.

అలాగే ఉపాధ్యాయులు, పంచాయతీ కార్మికులు ఇటీవల పోరాట మార్గంపట్టారు. జూన్‌లో బదిలీ అయిన ఉపాధ్యాయులకు జూన్, జులై జీతాలు చెల్లించని విషయం ప్రభుత్వం దృష్టికి రెండు నెలలుగా తీసుకొస్తున్నారు.

రెండు నెలల జీతాలు చెల్లించాలని యుటిఎఫ్ నేతృత్వంలో జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం వద్ద ఉపాధ్యాయులు ధర్నా కూడా చేపట్టారు. పదిహేనవ ఆర్థిక సంఘం నిధులొస్తే పంచాయతీ కార్మికులు, ఎలక్ట్రీషియన్, గ్రీన్ అంబాసిడర్ల జీతాలు చెల్లించాలని సర్పంచ్‌లు భావించారు. ఆ నిధులను వారికి తెలియకుండానే కరెంట్ బిల్లులకు ప్రభుత్వం మళ్లించడంతో నిధుల కొరత తీరలేదు. కార్మికుల జీతాల బకాయిలు చెల్లించలేదు. జీతాల బకాయిలు చెల్లించాలని సిఐటియు నాయకత్వాన పంచాయతీ కార్మికులు ఇటీవల ధర్నా చేపట్టి హామీ పొందారు.

బాబు పర్యటనపై దాడి దారుణం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఒక పెద్ద మైనింగ్ మాఫియా అని, కపట సన్యాసి అని టిడిపి మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి ఆరోపించారు. శనివారం సాయంత్రం పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ మంత్రి పదవిని అడ్డం పెట్టుకొని పెద్దిరెడ్డి మైనింగ్ మాఫియా చేస్తున్నారన్నారు. వివేకా హత్య కేసును చంద్రబాబు బయటకు తేవడాన్ని సిఎం జగన్ భరించలేకపోతున్నారన్నారు. శుక్రవారం పుంగనూరులో చంద్రబాబు పర్యటనలో వైసిపి మూకల దాడిని ఖండిస్తున్నట్లు చెప్పారు. చంద్రబాబుపైనా, టిడిపి కార్యకర్తలపైనా దాడి జరుగుతుంటే ఎస్‌పి రిశాంత్ రెడ్డి ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. చంద్రబాబుకు పోలీసులు భద్రత కల్పించడంలో విఫలమయ్యారని అన్నారు. అలాగే అనకాపల్లిలో సెక్షన్ 30 ఎందుకు పెట్టారని ప్రశ్నించారు. విసన్నపేటలో ప్రభుత్వ భూములను పవన్ కల్యాణ్ పరిశీలిస్తానంటే వైసిపి నేతలు భయపడుతున్నారని చెప్పారు.

మణిపూర్ అకృత్యాలను ఖండిస్తూ ధర్నా

ప్రజాశక్తి - కలెక్టరేట్ : మణిపూర్‌లో మారణ హోమాన్ని ఆపేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ జాన్‌వెస్లీ కోరారు. మణిపూర్‌లో క్రైస్తవులపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ లుధియానా పాల్ ఆధ్వర్యంలో శనివారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జాన్ వెస్లీ మాట్లాడుతూ మణిపూర్‌లో శాంతి భద్రతలు ఎంతగా క్షీణించాయో తెలియజేశారు. కార్యక్రమంలో హెప్సిబా, సాల్మన్ ప్రసన్న, సుధీనా పాల్, రూతు, షైనీ, ప్రిస్కిల్లా, గోల్డ్ నియర్, అభిషేక్, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా ఐఐపిఇ స్నాతకోత్సవం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ (ఐఐపిఇ) విశాఖపట్నం మూడో వార్షిక స్నాతకోత్సవం శనివారం నోవాటెల్ హోటల్‌లో ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ జియోమాగ్నెటిజం, ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ గౌరవ శాస్త్రవేత్త ప్రొఫెసర్ అర్చనా భట్టాచార్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పౌరుల జీవితాల మెరుగుదలకు కృషి చేయాలని విద్యార్థులను కోరారు. ఆయిల్ అండ్ ఎనర్జీ రంగాన్ని విద్యార్థినులు ఎంచుకోవడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఐఐపిఇ డైరెక్టర్ ప్రొఫెసర్ శాలివాహన్ సంస్థ కార్యకలాపాలపై మాట్లాడారు. ఈ స్నాతకోత్సవ వేడుకల వేళ అనకాపల్లి జిల్లా కలెక్టరు పట్టన్‌శెట్టి రవి సుభాష్‌కు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. ఆయన సొసైటీకి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ప్రస్తుత స్నాతకోత్సవంలో 2023 గ్రాడ్యుయేట్ బ్యాచ్‌కు చెందిన 102 మంది బిటెక్ విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు, వీరిలో పెట్రోలియం ఇంజినీరింగ్‌కు చెందిన 56 మంది, కెమికల్ ఇంజినీరింగ్‌కు చెందిన 46 మంది విద్యార్థులు ఉన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రామ్‌ఫాల్ ద్వివేది పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు తొలి ప్రాధాన్యత

ప్రజాశక్తి - కలెక్టరేట్ : నగరంలో మౌలిక వసతుల కల్పనే ప్రథమ కర్తవ్యమని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి అన్నారు. శనివారం ఆమె నాలుగో జోన్ 33వ వార్డు పరిధిలోని సాయిబాబా వీధి, బంగారమ్మ మెట్ట, అమ్మవారివీధి తదితర ప్రాంతాలలో సుమారు రూ.42.36 లక్షల వ్యయంతో సిసి రోడ్లు, సిసి కాలువల నిర్మాణానికి దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్, వార్డు కార్పొరేటర్ బీశెట్టి వసంతలక్ష్మితో కలిసి శంకుస్థాపన చేశారు.

యుపిఎస్‌సి పరీక్ష నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నగరంలో ఆదివారం నిర్వహించబోయే యుపిఎస్‌సి పరీక్షకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసినట్లు యుపిఎస్‌సి జాయింట్ సెక్రటరీ ముఖేష్ లాల్ తెలిపారు. శనివారం ఉదయం కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో పరీక్ష నిర్వహణపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాసమూర్తి, అండర్ సెక్రటరీ ఆర్యే దీక్షిత్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి

ప్రజాశక్తి-ములగాడ : విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని, వాటి సాధనకై నిరంతరం చిత్తశుద్ధితో కృషి చేయాలని మల్కాపురం పోలీస్ స్టేషన్ సిఐ జిడి.బాబు సూచించారు. స్థానిక సెయింట్ ఆన్స్ డిగ్రీ కళాశాలలో డిగ్రీ తృతీయ సంవత్సర విద్యార్థినుల వీడ్కోలు సమావేశం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిఐ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చదువు వల్లే వ్యక్తిత్వం వికసిస్తుందని, ధైర్యం వస్తుందని చెప్పారు. మహిళా సాధికారతలో విద్య మొదటిదని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ ప్రేమకుమారి మాట్లాడుతూ, సెయింట్ ఆన్స్‌లో చదివిన ప్రతి విద్యార్థినీ ఈ సమాజానికి ఉపయోగపడాలన్నారు. వివిధ అంశాలలో ప్రతిభ చూపిన విద్యార్థినులకు సిఐ ద్వారా బహుమతులను అందజేశారు. ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్, క్రీడలు, ఇతర సాంస్కృతిక అంశాలలో ప్రతిభ కనబరిచిన వారిని ప్రశంసా పత్రాలతో సత్కరించారు.

'భీమిలి నుంచి గంటా పోటీచేయాలి'

ప్రజాశక్తి- ఆనందపురం : మాజీ మంత్రి, విశాఖ ఉత్తర ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మళ్లీ భీమిలి నియోజకవర్గం నుండి పోటీచేయాలని నియోజకవర్గ ప్రజలు కోరుకుంటున్నారని ఆనందపురం మండలం వేములవలస ఉప సర్పంచ్ కోరాడ నవీన్ జ్ఞానేశ్వర్ కోరారు. గంటా శ్రీనివాసరావును నవీన్ జ్ఞానేశ్వర్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ, గతంలో భీమిలి ఎమ్మెల్యేగా గెలిచిన గంటా శ్రీనివాసరావు ఒక మోడల్ నియోజకవర్గంగా తీర్చి దిద్దారన్నారు. తర్వాత నియోజకవర్గంలో అభివృద్ధి కొరవడిందని ఆరోపించారు.

'ఉత్తరం'లో గ్రీవెన్స్

ప్రజాశక్తి-సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గంలో ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు వైసిపి సమన్వయకర్త కెకె.రాజు శనివారం పార్టీ కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజక వర్గానికి చెందిన పలువురు వచ్చి సమస్యలతో కూడిన వినతిపత్రాలను కెకె.రాజుకు అందించారు. వినతిపత్రాలను పరిశీలించిన కెకె.రాజు అధికారులతో మాట్లాడి కొన్నింటిని వెంటనే పరిష్కరించారు. మరికొన్నింటింకి సంబంధించి అధికారులకు రిఫర్ చేసి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

సేవా దృక్పథంతో సిబిఎన్ మిత్రమండలి ఏర్పాటు

ప్రజాశక్తి -గాజువాక : సేవా దృక్పథంతో సిబిఎన్ మిత్ర మండలిని ఏర్పాటుచేసినట్లు ఆ సంఘం నాయకులు టి.హర్షవర్ధన్‌ప్రసాద్ తెలిపారు. పాత గాజువాకలోని పంతులుగారు మేడ సమీపంలో సిబిఎన్ మిత్రమండలి సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా హర్షవర్ధన్‌ప్రసాద్ మాట్లాడుతూ, నియోజవర్గ పరిధిలో ఉన్న పేదలు, ఆపదలో ఉన్న వారికి సహాయం చేయాలనే ఉద్దేశంతో సిబిఎన్ మిత్రమండలి ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ఇది తెలుగుదేశం పార్టీకి అనుబంధంగానే పనిచేస్తుందని చెప్పారు. సంఘంలో 200 మంది సభ్యులు చేరారని తెలిపారు. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబుపై కొంతమంది కిరాయి గూండాలు పుంగనూరులో రాళ్లు విసిరి దాడి చేయడాన్ని ఖండించారు. ఇటువంటి సంఘటనలు రాష్ట్ర అభివృద్ధిని నిరోధించడమేనని తాము భావిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిబిఎన్ మిత్ర మండలి అధ్యక్షులు పాండురంగ జయరాజు, పసుపులేటి శ్రీనురావు, దేవుపల్లి సీతారాం, ఆండిబోయిన గురుమూర్తి, నెల్లి శ్రీనురావు, బంధం అప్పలరాజు, పి ధనరాజు, పూడి శాంతి, రమణ, దానబోయిన పైడికొండ సంపంగి సూరిబాబు, రాజన్ రాజు పాల్గొన్నారు.

మంత్రి ధర్మాన కుమారుని భూమికి వేస్తున్న రోడ్డును ఆపాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి పైడిరాజు

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి 5వ వార్డు పరిధి విశాఖపట్నం రూరల్ మండలం పరదేశిపాలెం సర్వే నెంబర్ 187/1లో రాష్ట్ర రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు కుమారుడు ధర్మాన రామ్‌మనోహర్ నాయుడు పేరుతో ఉన్న 'వర్ణిన్ డాక్ ప్రైవేట్ లిమిటెడ్'కు చెందిన 4.39 ఎకరాలు భూమికి జివిఎంసి నిధులతో వేస్తున్న రహదారిని వెంటనే అపాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు జివిఎంసి కమిషనర్‌కు లిఖిత పూర్వకంగా శనివారం ఫిర్యాదు చేశారు. అనంతరం పైడిరాజు మాట్లాడుతూ, మాజీ సైనికుడు వాసుపల్లి సత్తయ్య పేరున ఒక నకిలీ పట్టా సృష్టించి కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో రెవెన్యూ మంత్రిగా ఉన్న ధర్మాన ప్రసాదరావు తన పదవిని ఉపయోగించి జిల్లా కలెక్టర్ ద్వారా ఎన్ఒసి ఇప్పించుకొని భూమిని అన్యాక్రాంతం చేశారని ఆరోపించారు. భూమి కబ్జాకు గురైన వివరాలతో 2017లో అప్పటి ప్రభుత్వం నియమించిన సిట్‌కు సిపిఐ ఫిర్యాదు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రస్తుత ప్రభుత్వం నియమించిన సిట్‌కు కూడా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సిట్ దర్యాప్తులో ఉందని, ఇంకా నివేదిక బయట పెట్టకముందే ఆ భూమికి జివిఎంసి నిధులతో రహదారి నిర్మించడం సరికాదని, వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు ఎం.మన్మధరావు, ఎన్.నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శన పోటీలకు నవోదయ విద్యార్థులు

ప్రజాశక్తి -పిఎం పాలెం : కొమ్మాది సమీపంలో ఉన్న జవహర్ నవోదయ విద్యాలయ విద్యార్థులు క్లస్టర్ స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో రాణించి ప్రాంతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ కె.సంజయ్ తెలిపారు. కెమిస్ట్రీ విభాగంలో ప్లాస్టిక్ వ్యర్థాల నుంచి ఇంధనాన్ని తయారుచేసే నమూనా తయారు చేసినందుకు పదో తరగతి విద్యార్థి హర్షవర్ధన్, పర్యావరణ హిత బొమ్మలతో వ్యక్తిత్వ వికాసం కలిగించే ప్రదర్శన నమూనా రూపొందించిన తొమ్మిదో తరగతి విద్యార్థిని ఎన్.సాయి భువనశ్రీలు ఇటీవల యానాంలో నిర్వహించిన క్లస్టర్ స్థాయి పోటీలలో రాణించి ఎర్నాకులం నుండి ప్రాంతీయ స్థాయి వైజ్ఞానిక పోటీలకు ఆన్ లైన్ విధానంలో హాజరైనట్టు ప్రిన్సిపల్ తెలిపారు. వీరికి శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులు కాంతారావు, నాగేశ్వరరావును ప్రిన్సిపల్ అభినందించారు. విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు.

కాన్సషెంట్ సాఫ్ట్‌వేర్‌కు అవంతి విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి -తగరపువలస : అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం జరిగిన ప్రాంగణ ఎంపికలో ప్రస్తుత బి టెక్ నాలుగో ఏడాది చదువుతున్న ఐదుగురు అవంతి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు కాన్సషెంట్ సాఫ్ట్‌వేర్‌కు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ డాక్టర్ బి.మురళీకృష్ణ తెలిపారు. ఈ ప్రక్రియలో 513 మంది విద్యార్థులకు రాత పరీక్ష నిర్వహించగా, 41 మంది మౌఖిక పరీక్షకు ఎంపికయ్యారని, వారిలో చివరికి ఐదుగురు ఎంపికైనట్లు వివరించారు. ఎంపికైన వారికి ఏడాదికి రూ.8.50 లక్షలు వేతనం లభిస్తుందని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు, కార్యదర్శి డాక్టర్ ప్రియాంక, మేనేజింగ్ డైరెక్టర్ ఐ.శ్రావణ్‌కుమార్, డైరెక్టర్ ఎ.చంద్రశేఖర్ అభినందించారు.



ఎంపికైన విద్యార్థులు వీరే..

నులిపురుగుల నిర్మూలనలో భాగస్వాములు కావాలి

ప్రజాశక్తి -ఆనందపురం : నులిపురుగులు నిర్మూలన కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని ఎంపిపి ఎం.శారదాప్రియాంక కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ నెల 10వ తేదీన నిర్వహించే జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో 1-19 సంవత్సరాల పిల్లలందరికీ నులి పురుగుల మందులు వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, అంగన్వాడీలు, ఆశా వర్కర్లు, వాలంటీర్లు భాగస్వామ్యం కావాలన్నారు. ఆనందపురం ఎంఇఒ గంగరాజు మాట్లాడుతూ, ఉపాధ్యాయులందరూ పిల్లలు భోజనం చేసిన గంట తర్వాత ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆనందపురం పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ఎం.గంగునాయుడు, డాక్టర్ షహనాజ్ సాదియా, సామాజిక ఆరోగ్య అధికారి పి.సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలపై ధర్నా

ప్రజాశక్తి -పద్మనాభం : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎపిటిఎఫ్ ఆధ్వర్యాన శనివారం ఎంఇఒ కార్యాలయం ఎదుట ఉపాధ్యాయులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు నమ్మి పద్మరాజు మాట్లాడుతూ, బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు వెంటనే జీతాలు చెల్లించాలని, క్యాడర్ స్ట్రెంత్ అప్‌డేట్ చేయాలని డిమాండ్‌చేశారు. ఈ ధర్నాలో సభ్యులు సూర్యనారాయణ, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

అనంతపద్మనాభ స్వామి ఘాట్ రోడ్డులో టిడిపి సెల్ఫీ

ప్రజాశక్తి -పద్మనాభం : అనంత పద్మనాభ స్వామి ఘాట్ రోడ్డును పూర్తిచేయాలని భీమిలి తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబు సెల్ఫీ చాలెంజ్ చేశారు. పద్మనాభం గ్రామంలో అనంతపద్మనాభస్వామి కొండపైకి ఘాట్ రోడ్డు నిర్మాణం నాలుగు సంవత్సరాలుగా నిధులు లేక పూర్తి కాలేదని ఆయన తెలిపారు. ఈ నియోజకవర్గ ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మంత్రిగా పనిచేసి కూడా రోడ్ల అభివృద్ధిలో ఎటువంటి లక్ష్యాలు సాధించలేకపోయారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు కోరాడ రమణ, జడ్‌పిటిసి మాజీ సభ్యులు కె.దామోదర్‌రావు, టిడిపి నాయకులు, జి.ప్రసాదు, కె.శ్రీను, గంగరాజు, రమణ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక భవనం పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి- ములగాడ : జివిఎంసి 60వ వార్డు పరిధి ప్రియదర్శిని కాలనీలో రూ.9.30 లక్షలతో సామాజిక భవనం పునర్నిర్మాణ పనులకు వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ సహకారంతో వార్డు అభివృద్ధికి కృషిచేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బోగవిల్లి నాగభూషణం, జివిఎస్ఎన్.రాజు, కొల్లు నూకారెడ్డి, సోను, సిహెచ్.నూకరాజు, విజయ్, స్వప్న, మంగ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి -గోపాలపట్నం : ఉరి వేసుకుని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బుచ్చిరాజుపాలెం వేణుగోపాలస్వామి ఆలయం సమీపంలో చోటు చేసుకుంది. ఎయిర్ పోర్టు పోలీసులు, కుంటుంబ సభ్యుల కథనం ప్రకారం... శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలం పతివాడపాలేనికి చెందిన రెడ్డి శ్రీనివాసరావు (26). జియో ఫైబర్ పనులు చేసేందుకు అక్షయ కమ్యూనికేషన్ వద్ద సబ్ కాంట్రాక్ట్ తీసుకున్నారు. బుచ్చిరాజుపాలెంలో మూడు నెలలుగా అద్దెకు ఉంటున్నారు. శ్రీనివాసరావు స్వగ్రామానికి వెళ్లి తిరిగి శుక్రవారం రాత్రి ఇక్కడికి వచ్చాడు. ఆ ఇంట్లో ఒక్కడే ఉన్నాడు. తన వద్ద పనిచేసే యువకులకు ఫోన్ చేసి తాను వచ్చేశానని, ఈ రాత్రికే మీరు రావాలని చెప్పాడు. రాత్రి12 గంటల సమయంలో యువకులు ఆ ఇంటికి చేరుకున్నారు. తలుపు కొట్టినా తీయక పోవడంతో ఫోన్ చేశారు. అయినా స్పందించక పోవడంతో నిద్రలో ఉన్నడనుకొని వారు మేడపైకి వెళ్లి నిద్రించారు. ఉదయాన్నే లేచి మళ్లీ తలుపు కొట్టినా తీయలేదు. దీంతో ఇంటి యజమానికి సమాచారమిచ్చారు. ఇంటియజమాని వెనుక వైపు ఉన్న కిటికీ తలుపులు విరిచి చూసే సరికి శ్లాబ్ హుక్కుకు తాడుతో ఉరివేసుకుని మృతి చెందినట్లు గుర్తించారు. వెంటనే 100కి ఫోన్ చేయడంతో ఎయిర్‌పోర్టు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఘటనా స్థలంలో బీరు సీసాలు, తినుబండారాలు ఉన్నాయి. మృతునికి తల్లి, తండ్రి, ఇద్దరు అక్కలు ఉన్నారు. మృతికిగల కారణాలు తెలియరాలేదు. తండ్రి రెడ్డి సత్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బంగారం, నగదు చోరీ

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని కలిగొట్ల గ్రామంలో శుక్రవారం రెండున్నర తులాల బంగారం, 4 వేల నగదు చోరీ జరిగింది. ఎస్ఐ డి.నాగేంద్ర కథనం ప్రకారం... గ్రామానికి చెందిన దొగ్గ పోతయ్య కుటుంబం ఉదయాన్నే ఇంటికి తాళాలు వేసి పొలం పనికి వెళ్లిపోయారు. వీరి ఇంటి పక్కనే నివాసముంటున్న వనుం పాలవెల్లి (29) అనే ట్రాక్టర్ డ్రైవర్ పోతయ్య ఇంటి తాళాలు పగలగొట్టి ఇంట్లోని బీరువాలో ఉన్న రెండున్నర తులాల బంగారం నల్లపూసల దండ, రూ.4వేలు నగదు అపహరించుకుపోయాడు. సాయంత్రం ఇంటికి వచ్చిన పోతయ్య తమ ఇంటిలో దొంగతనం జరిగిన గుర్తించి దేవరాపల్లి పోలీసులకు శుక్రవారం రాత్రి ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ డి.నాగేంద్ర కేసు నమోదు చేసి అనుమానితులపై నిఘా ఉంచారు. చోరీ చేసిన బంగారు ఆభరణంతో పాటు నగదుతో పరారైన పాలవెల్లిని శనివారం ఉదయం కాశీపురం జంక్షన్‌లో అదుపులో తీసుకొని విచారణ చేశారు. చోరీ చేసినట్లు అంగీకరించడంతో నిందితున్ని అరెస్టు చేసి చోడవరం కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్సై తెలిపారు.

ముగిసిన ప్రధానోపాధ్యాయుల శిక్షణ

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక దొరతోట ప్రైవేట్ పాఠశాలలో మూడు రోజులుగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు జరిగిన శిక్షణా తరగతులు శనివారంతో ముగిశాయి. శిక్షణలో కాగితాలు, బెలూన్లతో వివిధ రకాల వస్తువులు తయారు చేశారు. బోధన, ఆట పాటలు, యోగా క్రీడాంశాలు వంటివి శిక్షణలో ప్రదర్శించారు. విద్యాశాఖ ఆర్‌జెడి జ్యోతికుమారి, డిఇఒ ఎల్.చంద్రకళ, సమగ్ర శిక్ష జిల్లా అధికారి బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. సుమారు 300 మంది ప్రధానోపాధ్యాయులు శిక్షణలో పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఐద్వా నాయకులు

మహిళా పోరుయాత్ర పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -ములగాడ : మహిళా పోరు యాత్రను జయప్రదంచేయాలని, మహిళలపై హింసను వ్యతిరేకించాలని కోరుతూ అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) మల్కాపురం జోన్ కమిటీ ఆధ్వర్యాన శనివారం వెంకన్నపాలెంలోని సిఐటియు కార్యాలయంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐద్వా మల్కాపురం జోన్ కార్యదర్శి ఆర్.విమల మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా మహిళ పోరు యాత్ర గత నెల 28 నుండి ఆగస్టు 8వ తేదీ వరకు ఉత్తరాంధ్ర జిల్లాలో సాగుతున్నట్లు తెలిపారు. ఈ నెల 8న విజయవాడలో భారీ బహిరంగ సభ ఉంటుందని చెప్పారు. ఈ సభకు ఐద్వా జాతీయ నాయకులు బృందాకరత్, పుణ్యవతి హాజరవుతారని తెలిపారు. ఈ సభకు మహిళలు హాజరై జయప్రదంచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా మల్కాపురంజోన్ అధ్యక్షులు బర్రి మమత, నాయకులు వై.కల్యాణి, ఎం.జయలక్ష్మి, పి.వరలక్ష్మి, బి.రాజేశ్వరి, ఎన్.ఉమ, జి.రామలక్ష్మి పాల్గొన్నారు.

కార్పొరేటర్ ఫిర్యాదుతో..

తూతూ మంత్రంగా పునాది తొలగింపు

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 94వ వార్డు పరిధి పురుషోత్తం సర్వేనెంబర్ 8లో శ్మశానాన్ని ఆనుకొని ఉన్న గెడ్డ పోరంబోకు భూమిని కొంతమంది ఆక్రమించి పునాది నిర్మించారు. దీనిపై స్థానిక కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు జివిఎంసి, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. జివిఎంసి అధికారులు పునాది తొలగించేందుకు అక్కడికి వెళ్లారు. ఈ లోగా ఒక ప్రజా ప్రతినిధి నుండి ఫోను రావడం తూతూ మంత్రంగా తొలగించి అధికారులు వెనుదిరిగారు.

పెందుర్తి మండలంలో గెడ్డ పోరంబోకును ఆనుకొని పలు అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని పలుమార్లు తహశీల్దార్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. వర్షాలు ఎక్కువగా పడితే పక్కనే ఉన్న ప్రాంతాలు ముంపునకు గురయ్యే అవకాశం ఉందని వారు వాపోతున్నారు. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన రెవెన్యూ అధికారులు ఉదాశీనంగా వ్యవహరించడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. కబ్జాలపై జిల్లా కలెక్టర్ స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.



రాఘవేంద్ర స్కూల్లో గ్రీన్ డే వేడుకలు

రాఘవేంద్ర స్కూల్లో గ్రీన్ డే వేడుకలు

ప్రజాశక్తి -గాజువాక : శ్రీనగర్‌లోని విశాఖ డిఫెన్స్ అకాడమీకి చెందిన రాఘవేంద్ర స్కూల్లో గ్రీన్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు గ్రీన్ దుస్తులు ధరించి పాఠశాలకు హాజరయ్యారు. గ్రీన్ డే విశేషాలను విద్యార్థులకు పాఠశాల యాజమాన్య ప్రతినిధులు వివరించారు. మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని తెలిపారు. మొక్కలు నాటాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

7న రాష్ట్రీయ ఒబిసి మహా సంఘ్ జాతీయ మహాసభ



మాట్లాడుతున్న రామమోహనరావు

ప్రజాశక్తి-మాధవధార : రాష్ట్రీయ ఒబిసి మహాసంఘ్ 8వ జాతీయ మహాసభలను ఈ నెల 7వ తేదీన తిరుపతిలో నిర్వహించనున్నట్లు ఆల్ ఇండియా బిసి ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పప్పల రామమోహనరావు తెలిపారు. ఫెడరేషన్ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ సభకు బిసిలు భారీ సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. జాతీయస్థాయిలో కుల ప్రాతిపదికన జనగణన జరగాలని, 53 శాతం ఉన్న బిసి జనాభాను కులాల వారీగా గుర్తించాలని, ఉద్యోగ అవకాశాలలోనూ, రాజ్యాధికారంలోనూ బిసిలకు జనాభా ఆధారంగా ప్రాతినిధ్యం కోసం జాతీయస్థాయిలో ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు జస్టిస్ వి.ఈశ్వరయ్య నాయకత్వంలో జరుగుతున్న పోరాటానికి ప్రజలందరి మద్దతు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.

'క్విట్ మోడీ-సేవ్ వైజాగ్ స్టీల్'ను జయప్రదంచేయాలి

ప్రజాశక్తి-ఉక్కునగరం : క్విట్ ఇండియా స్ఫూర్తితో ఈ నెల 9వ తేదీన "క్విట్ మోడీ-సేవ్ వైజాగ్ స్టీల్" నినాదంతో జరుగుతున్న నిరసన దీక్షను జయప్రదం చేయాలని స్టీల్ సిఐటియు గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్ పిలుపునిచ్చారు. ఉక్కునగరంలోని సిఐటియు కార్యాలయంలో స్టీల్ సిఐటియు వర్కింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయోధ్యరామ్ మాట్లాడుతూ, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక హక్కులను, ప్రభుత్వ రంగ పరిశ్రమల భవిష్యత్తును నిర్వీర్యం చేస్తోందని, దీనికి వ్యతిరేకంగా కేంద్ర కార్మిక సంఘాలు "క్విట్ మోడీ- సేవ్ ఇండియా"అన్న నినాదాన్ని ఇచ్చాయని తెలిపారు. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన పెద్ద ఎత్తున కార్మిక లోకాన్ని కదిలించి ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

విశాఖ ఉక్కు కర్మాగారానికి తీవ్రంగా ముడి సరుకుల కొరతను సృష్టించి పరిశ్రమ భవిష్యత్తును అంధకారంలోకి నెట్టే విధంగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వ్యవహరించడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ పనికి వత్తాసుగా గంగవరం పోర్ట్ యాజమాన్యం వ్యవహరిస్తోందని విమర్శించారు. ఈ సమయంలో కార్మికుల మధ్య ఐక్యతను పెంపొందించే విధంగా సిఐటియు కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు.



వర్కింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న రామస్వామి

స్టీల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి మాట్లాడుతూ, విశాఖ స్టీల్ కార్మికులకు నూతన వేతనాలు అమలు చేయడంలో యాజమాన్యం, కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని తీవ్రంగా వ్యతిరేకించారు. కార్మిక ప్రయోజనాలను ఆశించి, కార్మిక సంఘాలు తమ విద్వేషాలను పక్కనపెట్టి ప్రభుత్వం, యాజమాన్యాలపై పోరాటానికి సన్నద్ధం చేయాలని పిలుపునిచ్చారు. స్టీల్ సిఐటియు అధ్యక్షులు వైటి.దాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో స్టీల్ సిఐటియు నాయకులు బి.అప్పారావు, యు.వెంకటేశ్వర్లు, పుల్లారావు, మొహిద్దీన్, ఎ.శ్రీనివాసరావు, రమణమూర్తి, ఆర్.రాజేశ్వరరావు, డిఎస్.శ్రీనివాస్, రామన్న, విడివి పూర్ణచంద్రరావు, డి.సత్యనారాయణ, కె.బాలశౌరి, సిహెచ్.వెంకట్రావు, వివిధ విభాగాల అధ్యక్ష కార్యదర్శులు, వర్కింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కోతపెట్టిన వేతనం చెల్లించాలని ధర్నా



ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ప్రజాశక్తి-ఉక్కునగరం : వేతనాల్లో కోతపెట్టిన రూ.2,400 వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యాన అడ్మిన్ బిల్డింగ్ వద్ద శనివారం కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా స్టీల్‌ప్లాంట్ కాంటాక్ట్ లేబర్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షులు జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ, దేశంలో ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటుపరం చేసి కార్మికులను రోడ్డు మీద పడేయాలని చూస్తున్న మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. పోరాటాలు, త్యాగాలతో సాధించుకున్న కార్మిక హక్కులను వదులుకోవడానికి కార్మికులు సిద్ధంగా లేరన్నారు. కార్మిక నాయకుడు మంత్రి రవి మాట్లాడుతూ, స్టీల్ యాజమాన్యం, కాంట్రాక్టర్లు ఆడుతున్న డ్రామాలో కాంట్రాక్టు కార్మికులు బలవుతున్నారన్నారు. సిఐటియు నాయకులు వివి రమణ మాట్లాడుతూ, ఐఆర్, ఎస్ఎంఎ, ఎఎస్ఎంఎ చెల్లించేందుకు తగు ఏర్పాట్లుచేసి కార్మికుల మనోధైర్యం దెబ్బతీయకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు సత్యారావు (హెచ్ఎంఎస్), వంశీ (ఐఎన్‌టియుసి), నమ్మి రమణ (సిఐటియు), నగిరి అప్పారావు, బొట్ట గంగరాజు, యు.అప్పారావు, డి.అప్పలనరసమ్మ, వెంకటలక్ష్మి, రాము, సత్యనారాయణ, అప్పారావు, లక్ష్మి, దేవిక, శ్రీను, పైడిరాజు పాల్గొన్నారు.

ఘనంగా ఐలు విశాఖ జిల్లా మహాసభ

ప్రజాశక్తి-లీగల్ విలేకరి : ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) విశాఖపట్నం యూనిట్ నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా సురేష్, వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. ఐలు విశాఖపట్నం జిల్లా మహాసభలు శనివారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ఈ మహాసభకు ముఖ్యఅతిథిగా దామోదర్ సంజీవయ్య లా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ పి.శ్రీసుధ హాజరై మాట్లాడారు. 'స్వతంత్ర న్యాయవ్యవస్థ జవాబుదారీతనం' అంశంపై పలు సుప్రీంకోర్టు తీర్పులను వివరిస్తూ ప్రసంగించారు. విశ్రాంత జిల్లా న్యాయమూర్తి యు.సత్యారావు భారతీయ వారసత్వ చట్టం, చట్టం సవరణలను వివరించారు. అనంతరం మధ్యాహ్నం డెలిగేట్స్ సమావేశంలో ప్రధాన కార్యదర్శి నివేదికను సమర్పించారు. మణిపూర్, హర్యానాలో జరిగిన మత ఘర్షణలకు వ్యతిరేకంగా తీర్మానాలు చేశారు. తదుపరి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మూడేళ్లకోసారి జరిగే ఈ ఎన్నికలో గౌరవాధ్యక్షులుగా బివి రామాంజనేయరావు, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా సీనియర్ న్యాయవాదులు అల్లు సురేష్, ఎన్.వెంకటేశ్వరరావు, కోశాధికారిగా అప్పలరెడ్డిని ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గానికి న్యాయవాద సంఘం అధ్యక్షులు ప్రధాన, కార్యదర్శులు ఇతర న్యాయవాది మెంబర్లు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయవాద సంఘం అధ్యక్షులు చింతపల్లి రాంబాబు, ప్రధాన కార్యదర్శి పైలా శ్రీనివాసరావు, ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ సభ్యులు సిహెచ్.ఆనందరెడ్డి, బగాది తులసీదాస్, పూర్ణిమ, శాస్త్రి, సింధుజ, ఇతర న్యాయవాదులు, మహిళా న్యాయవాదులు, న్యాయ విద్యార్థులు పాల్గొన్నారు.

పౌష్టికాహారకిట్లు పంపిణీ

ప్రజాశక్తి-యంత్రాంగం

సీతమ్మధార : జివిఎంసి 46వ వార్డు పరిధి శాంతి నగర్ వార్డు కార్యాలయంలో అన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు సంబంధించి గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం కిట్లును డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ ద్వారా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గర్భిణులు, బాలింతల ఆరోగ్యం కోసం రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారాన్ని ముఖ్యమంత్రి అందిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి కో-ఆప్షన్ సభ్యులు సేనాపతి అప్పారావు, కె.చిన్నా, సీతయ్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జివిఎంసి 47వ వార్డు పరిధి పెద్ద కొత్తూరు అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, వార్డు కార్పొరేటర్ కంటిపాము కామేశ్వరితో కలిసి వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కిట్లు అందజేశారు.

భీమునిపట్నం : జివిఎంసి ఒకటో జోన్ పరిధి మూడో వార్డు అంగన్వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు టేక్ హోమ్ రేషన్ కిట్లు శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి మూడో వార్డు అధ్యక్షులు అల్లిపిల్లి నరసింగరావు, మాజీ కౌన్సిలర్లు కదిరి ఎల్లాజీ, మైలపల్లి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు. ఇదే అంగన్వాడీ కేంద్రంలో గర్భిణులకు, బాలింతలకు వార్డు కార్పొరేటర్ గంటా అప్పలకొండ ద్వారా కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు తదితరులు పాల్గొన్నారు.



పౌష్టికాహార కిట్లను అందిస్తున్న డిప్యూటీ మేయర్ సతీష్

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం

ప్రజాశక్తి -గాజువాక : అభివృద్ధి, సంక్షేమం ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి లక్ష్యమని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పేర్కొన్నారు. జివిఎంసి 76వ వార్డులో రూ.275 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు మేయర్, గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, విశాఖపట్నంలో అన్ని వార్డుల అభివృద్ధే లక్ష్యంగా పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ, అర్హత కల్గిన ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాలు అందించడంతోపాటు, అన్ని ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి కృషి చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ పి.సింహాచలం, వార్డు వైసిపి ఇన్‌ఛార్జి దొడ్డి రమణ, తాటికొండ జగదీష్ పాల్గొన్నారు.

54వ వార్డులో గడపగడపకు..

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 54వ వార్డు పరిధి మహారాణిపేట-2, గవరవీధి, గోలవీధి ప్రాంతాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు, 54 వార్డు కార్పొరేటర్ చల్లా రజిని, వైసిపి నాయకులు ఈశ్వరరావుతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఇప్పటివరకు ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కెకె.రాజు మాట్లాడుతూ, ప్రతి పేదవానికీ పథకాలు అందేలా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కృషిచేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో యాత కార్పొరేషన్ చైర్మన్ పిల్లి సుజాత, డైరెక్టర్ రాయుడు శ్రీను, వార్డు నాయకులు చిరంజీవి, అచ్చుతరావు, వెంకటేష్, గౌరీ ప్రసాద్, రమణమ్మ, ప్రకాశరావు, రాధాకృష్ణ, హరినాథ్‌రెడ్డి, శ్రీను, రమేష్, నాగరాజు, లాయర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 47వ వార్డులో రూ.3.64 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు కప్పరాడలోని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద వార్డు కార్పొరేటర్ కంటిపాము కామేశ్వరి సమక్షంలో ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అంబేద్కర్ ఎస్టేట్, సురేష్ రామ్‌నగర్, అరుంధతి నగర్, కప్పరాడ-2, పెద్ద కొత్తూరు, కప్పరాడ, రంజీ ఎస్టేట్ ప్రాంతాల్లో బిటి రోడ్లు, సిసి రోడ్లు, ఎస్‌డబ్ల్యు డ్రెయిన్లు, రిటైనింగ్ వాల్ నిర్మాణం తదితర పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, వార్డు నాయకులు వసంతల అప్పారావు, సుకుమార్, గురువోజీ, రాఘవులు, ముక్క రమణ, సురేష్, వాసు, కృప, నరసింగ్, చందురెడ్డి, అనీల్, కనకరాజు పాల్గొన్నారు.


ఆర్థిక సాయం అందజేస్తున్న కౌన్సిలర్ దాసరి కుమార్

పూరిల్లు దగ్ధం
రూ.2 లక్షల ఆస్తి నష్టం

ప్రజాశక్తి-యలమంచిలి రూరల్ : యలమంచిలి మున్సిపాలిటీ 20వ వార్డు పరిధి పెద్దపల్లి గ్రామంలో శుక్రవారం ఉదయం జరిగిన అగ్ని ప్రమాదంలో గ్రామానికి చెందిన బొద్దపు నాయుడు చినమ్ములుకు చెందిన పూరిల్లు దగ్ధమైంది. ఇంట్లో వంట చేస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. స్థానికులు మంటలను అదుపు చేయడానికి ప్రయత్నించినా సాధ్యం కాలేదు. ఇల్లు మొత్తం కాలి బూడిదైంది. దీంతో బాధిత కుటుంబం కట్టుబట్టలతో రోడ్డున పడింది. ఈ ఘటనలో రూ.30 వేల నగదుతో పాటు వంట సామగ్రి, ఎలక్ట్రికల్ వస్తువులు, బట్టలు కాలిపోవడంతో సుమారు రూ.2 లక్షల వరకు ఆస్తి నష్టం జరగడంతో బాధితులు కన్నీరుమున్నీరయ్యారు. నిరుపేద కుటుంబమైన తమను ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమాచారం అందుకున్న స్థానిక కౌన్సిలర్ దాసరి కుమార్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. స్థానిక వైసిపి నాయకుల సహాయంతో రూ.10వేలు నగదు, 50 కేజీల బియ్యాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు యర్రయ్య దొర, కౌన్సిలర్ దుంగ అచ్యుతరావు, కోడిగుడ్డు రమణ బాబు, మణి ప్రకాష్, స్థానిక వైసిపి నాయకులు పాల్గొన్నారు.

వృద్ధులకు ఎస్‌బిఐలో ప్రత్యేక సదుపాయాలు

ప్రజాశక్తి-అనకాపల్లి : వృద్ధుల కోసం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ప్రత్యేక సదుపాయాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని అనకాపల్లి గవరపాలెం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ ఉదయకుమార్ తెలిపారు. పట్టణంలోని రైతు భారతిలో శనివారం జరిగిన జిల్లా వృద్ధుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వృద్ధుల సమస్యలను దృష్టిలో పెట్టుకొని ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ ఉదయ్ కుమార్‌ను సత్కరించారు. కార్యక్రమంలో వయోవృద్ధుల సంక్షేమ సంఘం వ్యవస్థాపకులు కెప్టెన్ అప్పారావు, ఉపాధ్యక్షులు ఎంఎంఎస్ అప్పారావు, విశ్రాంత అధ్యాపకులు శరగడం నూకరాజు, మాజీ కౌన్సిలర్ బొడ్డేడ అప్పారావు, బుద్ద తాతారావు, బీశెట్టి కృష్ణప్పారావు పాల్గొన్నారు.

తహశీల్దారు కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి బుచ్చయ్యపేట : బుచ్చయ్యపేట మండల తహశీల్దార్ కార్యాలయ నూతన భవనాన్ని అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి, స్థానిక శాసనసభ్యులు కరణం ధర్మశ్రీ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధర్మ శ్రీ మాట్లాడుతూ 90 లక్షల రూపాయల నిధులతో తహసిల్దార్ కార్యాలయం నిర్మించడం జరిగిందన్నారు. బుచ్చయ్యపేట మండలం లో పలు రోడ్లు మరమ్మత్తులు గురై ఉన్నాయని, వాటి నిర్మాణానికి ఉపాధి హామీ నిధులను కేటాయించాలని కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో డిపిఓ శిరీష రాణి, జడ్పిటిసి దొండ రాంబాబు, మండల పార్టీ అధ్యక్షులు కొలిమల్ల అచ్చం నాయుడు, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, తహసీల్దారు కే. వెంకటేశ్వరరావు, ఎంపీడీవో సువర్ణ రాజు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పెరటి కోళ్లు పంపిణీ

ప్రజాశక్తి-చోడవరం : చోడవరం వెలుగు కార్యాలయం వద్ద డ్వాక్రా మహిళలకు పెరటి కోళ్లను ప్రభుత్వ విప్, స్థానిక శాసనసభ్యులు కరణం ధర్మశ్రీ శనివారం పంపిణీ చేశారు. అనంతరం స్థానిక జడ్పీ హైస్కూల్ వద్ద 35 లక్షలతో నిర్మించిన ప్రహరీ గోడను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు దగ్గర సమీపిస్తున్న కొలది తెలుగుదేశం నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, స్థానిక ఎంపీపీ గాడి కాసు, పిఆర్‌డిఇ జి ప్రసాద్, గాంధీ గ్రామ సర్పంచ్ గాడి అప్పారావు, స్వామి నాయుడు, ఒరుగంటి నెహ్రూ, పల్లా నర్సింగరావు, పుల్లేటి వెంకటేష్, అల్లాడ భవాని, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.


కోళ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ధర్మశ్రీ

మండల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-రాంబిల్లి

రాంబిల్లి మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సిపిఎం మండల కార్యదర్శి జి.దేముడునాయుడు డిమాండ్ చేశారు. సిపిఎం మండల సమావేశం మండల నాయకుడు రుత్తల రాంబాబు అధ్యక్షతన శనివారం స్థానిక పార్టీ కార్యాలయం వద్ద జరిగింది. ఈ సందర్భంగా దేముడునాయుడు మాట్లాడుతూ మండలంలో మెయిన్ రోడ్డుతో పాటు గ్రామాల్లో లింక్ రోడ్లు వేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని మండిపడ్డారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న సమగ్ర భూ సర్వేలో రైతులు అనేక సమస్యలు మండల, జిల్లాస్థాయి అధికారులు దృష్టికి తీసుకువెళ్ళినా పరిష్కరించడం లేదని విమర్శించారు. మండలంలో అనేక గ్రామాల్లో తాగునీరు, డ్రైనేజీ, వీధి దీపాలు వంటి మౌలిక సదుపాయాలు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నేవల్ బేస్ నిర్వాసితులు టెంట్ తీసేస్తే సమస్యలు పరిష్కరిస్తామని వాగ్దానం చేసి 5 నెలలు గడుస్తున్నా


మాట్లాడుతున్న సిపిఎం నాయకులు దేముడునాయుడు

నిర్వాసితులకు ప్యాకేజీ అందించడంలో ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సరికాదని పేర్కొన్నారు. మరో వైపు ఫార్మా కంపెనీల ప్రమాదం, కాలుష్యంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యలు పరిష్కారానికి ప్రభుత్వాలు చొరవ చూపాలని, లేని ఎడల ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సిహెచ్.రామకృష్ణ, వై.రాము, పి.మసేను, జి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని 7న కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి-అచ్యుతాపురం

ఫెర్రో అల్లాయిస్ పరిశ్రమలకు కరెంట్ ఛార్జీలు తగ్గించాలని కోరుతూ సోమవారం అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద తలపెట్టిన ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్ రాము పిలుపునిచ్చారు. ఎస్ఇజెడ్‌లో అభిజిత్, లలిత, మైతాన్, సుందరం పరిశ్రమల ఆవరణలో శనివారం సిఐటియు ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన విద్యుత్తు సంస్కరణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలకు గతంలో యూనిట్‌కు నాలుగు రూపాయల 95 పైసలు నుండి 8 రూపాయల 85 పైసలకు పెంచిందని తెలిపారు. దీనివలన పరిశ్రమలో పని చేస్తున్న కార్మికులకు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. ఇటువంటి విధానాల సృష్టి చెప్పి పెంచిన కరెంట్ ఛార్జీలను తగ్గించాలని ఉన్న పరిశ్రమలను కాపాడి నిర్వాసితులకు ఉపాధి కల్పించాలని సిఐటియు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాజు, చినబాబు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ట్రస్టు ప్రతినిధులు

'మొక్కల పంపిణీ' పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - సబ్బవరం : మండలంలోని గ్రేస్ ఆఫ్ గాడ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో లక్ష మొక్కల పంపిణీ కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు ట్రస్ట్ చైర్మన్ పి. విజయ కుమార్ తెలిపారు. ట్రస్ట్ కార్యాలయంలో శనివారం మొక్కలు పంపిణీ గోడపత్రిక (పోస్టర్)ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ట్రస్ట్ ద్వారా లక్ష మొక్కలు నాటాలని సంకల్పించామని, ఆ కార్యక్రమాన్ని ఈనెల12న మొదట విడతగా పది వేల మొక్కలు పంపిణీని సబ్బవరం స్థానిక సీతారామ కల్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పి.వరలక్ష్మి, ట్రస్ట్ సెక్రెటరీ ఎస్.శంకర్, ట్రెజరర్ పి.సూరిబాబు, డైరెక్టర్లు వి.జయబాబు, పి.ఆనందరావు, పి.విజయ్ కుమార్ ఎస్.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

బావుల్లో గంబూషియా చేపలు విడుదల

ప్రజాశక్తి - పరవాడ : జివిఎంసి 79వ వార్డులో వాడుకలో ఉన్న బావుల్లో గంబూషియా చేపలను స్థానిక కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ శనివారం విడిచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ చేపలు మలేరియా, డెంగీ వంటి వ్యాధులు వ్యాపింపజేసే దోమలను తింటాయని తెలిపారు. బావిలో నీరు పరిశుభ్రమవుతుందన్నారు. అనంతరం వార్డులో పర్యటించి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కెఎస్ఎన్ రెడ్డి నగర్ అంగన్వాడీ సెంటర్, ప్రశాంతి నగర్ సచివాలయ పరిధిలోని మూడు అంగన్వాడీ సెంటర్లలో సుమారు 120 మంది బాలింతలు గర్భిణీ స్త్రీలకు పోషకాహారం పంపిణీ చేశారు. సచివాలయాల సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది, మలేరియా సిబ్బంది, పాల్గొన్నారు.


బావిలో చేపలు వేస్తున్న కార్పొరేటర్ శ్రీనివాస్

నాగుపాము హల్‌చల్

దేవరాపల్లి : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ఎదురుగా ఉన్న పాత ఇనుప సామాన్ల దుకాణంలో శనివారం ఉదయం నాగుపాము హల్‌చల్ చేసింది. ఈ దుకాణంలోకి అందరూ చూస్తుండగానే పది అడుగుల నాగుపాము చొరబడింది. దీంతో షాపు యజమానులు భయంతో బయటకు పరుగులు తీశారు. ఈ విషయాన్ని అటవీ శాఖ గార్డ్ శివకుమార్ ద్వారా వన్యప్రాణుల సంరక్షణ సమితి సభ్యులు మూర్తికి సమాచారం ఇచ్చారు. ఆయన వెంటనే అక్కడకు చేరుకొని పాత సామాన్ల దుకాణంలో చొరబడిన వేసా నాగును చాకచక్యంగా బంధించి అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు.

కాయతొలచు పురుగు నివారణకు 'ఆగ్నేయాస్త్రం'

ప్రజాశక్తి-మునగపాక రూరల్ : కాయతొలచు పురుగు నివారణకు ఆగ్నేయాస్త్రం రసాయనం అద్భుత ఫలితాలను ఇస్తుందని కమ్యూనిటీ ఆర్గనైజర్ పాతాళం సత్యనారాయణ, మార్కెటింగ్ మాస్టర్ ట్రైనర్ సిరసపల్లి అప్పలరాజు పేర్కొన్నారు. మండలంలోని గణపర్తి గ్రామంలో శనివారం స్థానిక రైతులకు ప్రకృతి వ్యవసాయం, ఆగ్నేయాస్త్రం రసాయనం తయారీ విధానం తెలియజేశారు. కార్యక్రమంలో సిహెచ్.ఆదేశ్, ఏ మల్లేశ్వరరావు, అనూష్, నూక రత్నం, గౌరీ, ఆది పాల్గొన్నారు.


ఆగ్నేయస్త్రం తయారీపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం


రహదారిపై ఉన్న పెద్ద గోతులో వల వేసి నిరసన తెలుపుతున్న దృశ్యం

రహదారి గోతులు పూడ్చాలని నిరసన

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : రహదారుల గోతులు పూడ్చాలని కోరుతూ మండలంలోని చింతపాక, పెద్ద మదీన రోడ్ల వద్ద టిడిపి నాయకులు శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. రోడ్డుపై చెరువును తలపించేలా ఉన్న పెద్ద గోతులో వలవేసి చేపలను పట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా టిడిపి చోడవరం ఇన్చార్జి బత్తుల తాతయ్య బాబు, మాజీ ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు మాట్లాడుతూ అడుగడుగునా రోడ్డు పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి వాహనదారులు ఇబ్బంది పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. చోడవరం నియోజకవర్గంలో రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉందన్నారు. ప్రధాన రోడ్లతో పాటు గ్రామీణ రహదారులన్నీ చెరువులు తలపించేలా గోతులు ఏర్పడ్డాయని పేర్కొన్నారు. వర్షం పడితే ప్రయాణం నరకప్రాయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే రోడ్లు మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు కోటేశ్వరరావు, నాయకులు ఎంవివి సత్యనారాయణ, వియ్యపు అప్పారావు, డొంకిన అప్పలనాయుడు, కోరుకొండ రవికుమార్, వజ్రపు శ్రీను, ముచ్చకర్ల తాతీలు, సాయం శేషు, సిరిగిరి శెట్టి శ్రీరామ్మూర్తి, గొన్నాబత్తుల శ్రీనివాసరావు, సేనాపతి మణికంఠ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రభావతి

మహిళా సమాఖ్య సమావేశం

ప్రజాశక్తి -కశింకోట : స్థానిక వెలుగు కార్యాలయం వద్ద మహిళా సమాఖ్య సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆఫీసర్ ప్రభావతి మాట్లాడుతూ అంగన్వాడీ సెంటర్ ద్వారా పిల్లలకు, తల్లులకు ఇచ్చే ఆహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తల్లిపాల వారోత్సవాల్లో ప్రతీ డ్వాక్రా మహిళ పాల్గొవాలన్నారు. రక్తహీనత నివారణ కొరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తగు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏరియా కోర్డినేటర్ వి.ధర్మారావు, స్త్రీ నిధి మేనేజర్ వెంకి నాయుడు, మహిళ సమాఖ్య అధ్యక్షులు కె.అరుణ, ఏపిఎం ఎస్.శ్రీనివాసరావు, సీసీలు, విఒ పాల్గొన్నారు.

యంత్రాలతో నాట్లు వేస్తే సమయం ఆదా

ప్రజాశక్తి-దేవరాపల్లి : యంత్రాలతో నాట్లు వేయటం వలన తక్కువ సమయంలో ఎక్కువ ఎకరాలు నాట్లు వేయడంతో పాటు డబ్బులు కూడా ఆదా అవుతాయని వ్యవసాయ శాఖ అధికారి వై.కాంతమ్మ తెలిపారు. మండలంలోని తారువ, మారేపల్లి గ్రామాల్లో శనివారం వరి నారును, వరి నాట్లు వేసే యంత్రం ద్వారా నాట్లు జరిగే ప్రక్రియను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోజుకి ఒక యంత్రం ద్వారా, 6 నుంచి 8, ఎకరాలు వరి నాట్లు వేయవచ్చని తెలిపారు. ఈ యంత్రం ద్వారా నాట్లు వేయడం వలన గాలి వెలుతురు బాగా వెళ్లి ఎక్కువ పిలకలు వస్తాయని, పురుగు తెగుళ్ల బెడద తక్కువగా ఉంటుందని, అధిక దిగుబడి వస్తుందని, రైతుకు ఖర్చు కూడా తగ్గుతుందని చెప్పారు.


యంత్రం ద్వారా వరి నాట్లు వేయడానికి సిద్ధమవుతున్న సిబ్బంది



కేన్సర్ వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

స్క్రీనింగ్‌తో కేన్సర్ గుర్తింపు

ప్రజాశక్తి-అనకాపల్లి : స్క్రీనింగ్ ప్రారంభ దశలో క్యాన్సర్‌ను గుర్తించడంలో సహాయపడుతుందని హెూమీ బాబా కేన్సర్ హాస్పటల్, పరిశోధనా కేంద్రం (అగనంపూడి) ప్రివెంటివ్ అంకాలజీ విభాగాధిపతి డాక్టర్ డోల్‌రోసా ఫెర్నాండజ్ తెలిపారు. శ్రీగౌరీ గ్రంధాలయంలో హెూమీ బాబా క్యాన్సర్ హాస్పటల్, పరిశోధనా కేంద్రం సహకారంతో శనివారం కేన్సర్ ఉచిత నిర్ధారణ పరీక్షలు, అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉన్నట్లయితే, క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలన్నారు. క్యాన్సర్ తీవ్రమైన సమస్య, చికిత్స చేయకుండా వదిలేస్తే మరణానికి దారితీయవచ్చని హెచ్చరించారు. ప్రాణాంతకమైన కేన్సర్ వ్యాధిని ప్రాథమిక స్థాయిలోనే గుర్తించి తగిన చికిత్స చేయించుకోవాలని సూచించారు. వారసత్వంగా క్యాన్సర్ వ్యాధి అయిదు శాతం మందికి సోకుతుందని, కాబట్టి ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా రొమ్ము, మెడ, తల, గర్భాశయం, పొగాకు సంబంధిత, నోటి క్యాన్సర్, ఊపిరితిత్తులు, పేగులు, శ్వాస నాళాల్లో క్యాన్సర్ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యాధిని గుర్తించే మార్గాలు, ప్రమాద కారణాల గురించి ఫెర్జాండజ్ వివరించారు. కార్యక్రమంలో హెూమీ బాబా క్యాన్సర్ హాస్పటల్, పరిశోధనా కేంద్రం ప్రివెంటివ్ అంకాలజీ వైద్యుడు తరుణ్, శ్రీ గౌరీ గ్రంథాలయ అధ్యక్షుడు డి.నూకఅప్పారావు, కార్యదర్శి కాంద్రేగుల వెంకటరమణ, సభ్యులు మళ్ల బాపునాయుడు, భీశెట్టి కృష్ణ అప్పారావు, బొడ్డేడ జగ్గఅప్పారావు పాల్గొన్నారు.

వైద్య విద్య సీట్లు అమ్మకానికి పెట్టిన జగన్

ప్రజాశక్తి- అనకాపల్లి : వైద్య విద్య సీట్లు ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి అమ్మకానికి పెట్టారని టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగజగదీశ్వరరావు విమర్శించారు. శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ జగన్ రెడ్డి పథకం ప్రకారం వైద్య విద్యను ఎస్సీ ఎస్టీ బీసీలకు రిజర్వేషన్లు లేకుండా చేస్తున్నారని, ఆ కుట్రలో భాగంగానే 50 శాతం వైద్య విద్య సీట్లు అమ్మకానికి పెట్టారని విమర్శించారు. ప్రభుత్వం పేదలకు మేలు చేసే విధంగా ఉండాలి గాని వాళ్లకి దక్కే అవకాశాలను కాలరాయకూడదన్నారు. స్థానిక శాసనసభ్యులు జిల్లా మంత్రి గుడివాడ అమర్నాథ్, ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు అసమర్ధత కారణంగా సౌకర్యాలు లేని ప్రాంతంలో మెడికల్ కళాశాల ఏర్పాటు చేస్తే విద్యార్థులకు అగచాట్లు తప్పవన్నారు. వైద్య కళాశాలలో గరిష్టంగా జగన్ రెడ్డి నిర్ణయించిన 20 లక్షల రూపాయలు ఫీజు ఏ ఎస్సి, ఎస్టి బిసి మైనార్టీ విద్యార్థులు కడతారని ప్రశ్నించారు. కేవలం 25 సీట్లలోనే ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ విద్యార్థులకు అవకాశం కల్పించడమంటే ఆయా వర్గాలకు దారుణంగా అన్యాయం చేయడం కాదా? అని ప్రశ్నించారు.

విశ్రాంత హోంగార్డుకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-అనకాపల్లి : ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన హోంగార్డు కూడ నాగేశ్వరరావు కుటుంబానికి ఎస్పి మురళీకృష్ణ శనివారం తన కార్యాలయంలో ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ హెూంగార్డుగా 1988 నుండి పాడేరు, జి మాడుగుల, స్టీల్ ప్లాంట్ తదితర ప్రాంతాల్లో అంకితభావంతో విధులు నిర్వహించి అధికారులు మన్ననలు పొందారని తెలిపారు. అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలలో పనిచేస్తున్న హెూంగార్డులు అందరూ స్వచ్ఛందంగా వారికి వచ్చే ఒక రోజు వేతనం మొత్తం రూ.3,88,370 చెక్కును నాగేశ్వరరావుకు ఎస్పీ అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (పరిపాలన) బి.విజయ భాస్కర్, సీనియర్ అసిస్టెంట్ భవాని పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న ఎస్పి మురళీకృష్ణ

సెక్షన్ 30 పోలీసు యాక్ట్ అమలుపై టిడిపి నిరసన



నిరసన తెలుపుతున్న టిడిపి శ్రేణులు

ప్రజాశక్తి- అనకాపల్లి

జిల్లాలో సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమలుపై స్థానిక టిడిపి కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద నియోజకవర్గాల అధ్యక్షులతో కలిసి పార్టీ జిల్లా అధ్యక్షులు బుద్ద నాగజగదీశ్వరరావు శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సెక్షన్ 30 పోలీస్ యాక్ట్‌ను హైకోర్టు కొట్టి వేసినప్పటికీ పుంగనూరు సంఘటన నేపథ్యంలో మరలా పోలీసులు సెక్షన్ 30 తీసుకొచ్చి రాజకీయ పార్టీలు ధర్నాలు, ఊరేగింపులు, సభలు నిర్వహించకుండా ప్రతి నియోజకవర్గంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడం దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కుప్పిలి జగన్, దాడి జగన్, ఆళ్ల రామచంద్రరావు, సాలాపు నాయుడు, అండిబోయిన శేషు, వేగి వెంకటరావు, కర్రి మల్లేశ్వరరావు, బొడ్డేడ శ్రీను, ఆళ్ల జగన్, ఆకుల నానాజీ, పెంటకోట శివరాం, వానపల్లి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్ పర్యటనను అడ్డుకునేందుకే..

అనకాపల్లి : జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వారాహి యాత్రను అడ్డుకునేందుకే సెక్షన్ 30 పోలీస్ యాక్ట్‌ను తెరపైకి తెచ్చారని జనసేన పార్టీ నాయకులు ఆరోపించారు. స్థానిక తాడి రామకృష్ణ స్వగృహంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వారాహి యాత్ర 3వ విడతలో విస్సన్నపేట వివాదాస్పద భూ కుంభకోణం భూములలో జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ పర్యటన నేపథ్యంలో ఇటువంటి చర్యలు తీసుకోవడం దుర్మార్గమన్నారు. భూ అక్రమాలను కప్పిపుచ్చుకునేందుకే సెక్షన్ 30ను అమలు చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో జనసేన నాయకులు దూలం గోపి, శ్రీరాందాస్ గోవింద్, తాడి రామకృష్ణ, మళ్ల శ్రీను, అప్పికొండ గణేష్, సీత, కోన దుర్గ, గొల్లవిల్లి రాజు, కాంద్రేగుల ప్రసాద్, లక్ష్మణ్, దుర్గ ప్రసాద్, గణేష్, వర్మ, శ్యామ్ పాల్గొన్నారు.

టిడిపి నేతల అడ్డగింత

మునగపాక రూరల్ : చిత్తూరు జిల్లా పుంగనూరులో జరిగిన ఘటనపై మునగపాకలో నిరసన కార్యక్రమానికి వెళ్తున్న టిడిపి నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. సెక్షన్ 30 అమలులో ఉందని పోలీసులు వారిని గృహనిర్బంధం చేశారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు దాడి ముసిలి నాయుడు, పెంటకోట విజయ్, భీమర శెట్టి శ్రీనివాసరావు, దాడి శివ మాట్లాడుతూ నిరసన తెలియచేసిన వారిని అరెస్టులు చేయడం అప్రజాస్వామ్యమన్నారు. కార్యక్రమంలో ఆడారి జానకి, మల్ల వరాహ నర్సింగరావు, ఆడారి లక్ష్మణరావు, గోవిందరావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



పోలీసులను ప్రశ్నిస్తున్న ప్రగఢ, పప్పల తదితరులు

సహనాన్ని పరీక్షిస్తే సహించేది లేదు

అచ్యుతాపురం : ప్రజల సహనాన్ని పరీక్షిస్తే సహించేది లేదని మాజీ ఎమ్మెల్సీ పప్పుల చలపతిరావు అన్నారు. అచ్చుతాపురంలో శనివారం తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సమావేశం నియోజకవర్గ ఇన్చార్జి పగడ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ నేపథ్యంలో పోలీసులు అక్కడికి వచ్చారు. దీంతో టిడిపి పోలీసులతో వాగ్వాదం చేశారు. అనంతరం చలపతిరావు మాట్లాడుతూ టిడిపి కార్యకర్తలను, నాయకులను వేధించడం, గృహనిర్బంధం చేయటం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రజాస్వామ్య యుతంగా పరిపాలన సాగించాలని హితవుపలికారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు జనపరెడ్డి నర్సింగరావు, కూనిశెట్టి సత్తిబాబు, ఎం బాపు నాయుడు, పి కొండబాబు, లాలం రాజు పాల్గొన్నారు.

జిల్లాలో అమలు

ప్రజాశక్తి- అనకాపల్లి, పరవాడ

జిల్లాలోని అనకాపల్లి, పరవాడ, నర్సీపట్నం సబ్ డివిజన్లలో సెక్షన్ 30 పోలీసు యాక్ట్ అమలులో ఉన్నట్లు అనకాపల్లి డిఎస్‌పి కార్యాలయ సిబ్బంది, పరవాడ సిఐ పి.ఈశ్వరరావు శనివారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లాలో బహిరంగ సభలు, ఊరేగింపులు, పబ్లిక్ రోడ్లు, వీధులు, ఇతర మార్గాల్లో ఎటువంటి కార్యక్రమాలు నిర్వహించినా సెక్షన్ 30 పోలీసు యాక్ట్ ప్రకారం శిక్షార్హులని పేర్కొన్నారు. కావున ఎవరైనా ముందస్తుగా సబ్ డివిజన్ అధికారుల అనుమతితో మాత్రమే కార్యక్రమాలు నిర్వహించాలని స్పష్టం చేశారు.

చీడికాడ : ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో పోలీస్ చట్టం 30 అమలులో ఉందని ఎస్ఐ పి.రామారావు తెలిపారు. మండలంలో ఏ గ్రామాలలో కూడా బహిరంగ సభలు. ఊరేగింపులు, రోడ్‌షోలు, ర్యాలీలు నిషేధమన్నారు.

విమాన ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా పనులు చేపట్టాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : విశాఖ విమానాశ్రయం రన్వే సర్ఫేస్ పనులు ఈ ఏడాది నవంబర్ నుంచి 2024 మార్చి వరకు నేవీ చేపట్టనున్న నేపథ్యంలో ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా పనుల సమయంలో మార్పులు చేయాలని టిడిపి పార్లమెంటరీ నియోజకవర్గ మీడియా కోఆర్డినేటర్ కొణతాల వెంకటరావు ఒక ప్రకటనలో తెలిపారు. రాత్రి 9 గంటల నుంచి ఉదయం 8 గంటల వరకు పనులు చేయడం వల్ల విమానాలకు అనుమతి లేకపోవడంతో 12 విమాన సర్వీసులు అందకుండా పోయే అవకాశం ఉందన్నారు. అలాకాకుండా రాత్రి 11 గంటల నుంచి ఉదయం 7 గంటల వరకు రన్వే పనులు చేపట్టడం ద్వారా ఈ విమాన సర్వీసులు అందుబాటులోకి ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా ఉంటుందని తెలిపారు.

జగన్ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయి

ప్రజాశక్తి-పరవాడ : రాష్ట్రంలోని వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని టిడిపి మండల అధ్యక్షులు వియ్యపు చిన్నా అన్నారు. శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ పుంగనూరులో తెలుగుదేశం అధినేత చంద్రబాబు మీద మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనుచరులు, గుండాలు రాళ్ల దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. రాష్ట్రం రావణ కాష్టంలా తయారు చేస్తున్నారని, రౌడీలు, కర్రలు, రాళ్ళ తో పరిపాలన చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో రాజారెడ్డి రాజ్యాంగం అమలు చేస్తున్నారన్నారు. ఎన్ని రోజులు ఇలాంటి దౌర్జన్యాలతో పాలన సాగిస్తారని ప్రశ్నించారు.

తల్లిపాల వారోత్సవాలపై ర్యాలీ

సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ

ప్రజాశక్తి - రావికమతం


మండలంలోని కవగుంట, గుడ్డిప అంగన్వాడీ కేంద్రాల్లో శనివారం వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కిట్లను ఆయా గ్రామాల సర్పంచులు దాసరి సూర్యకుమారి వరహాలు, గుమ్మాల గణేష్, చినపాచిల అంగన్వాడీ కేంద్రంలో రావికమతం పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ దుర్గాప్రసాద్ పంపిణీ చేశారు. బాలింతలు, గర్భిణులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది జి.వెంకటలక్ష్మి, శ్రీను రాజేశ్వరి, చల్లయ్యమ్మ పాల్గొన్నారు

మాడుగుల: తల్లి పాలతో బిడ్డలకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎంపిపి పెదబాబు అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో తల్లి పాల వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి రమణమ్మ, సర్పంచ్ కళావతి, వైస్ సర్పంచ్ శ్రీనాధు శ్రీనివాసరావు, ఎంపిడిఓ మీనా కుమారి, సిడిపిఓ శ్రీదేవి అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా పోషకాహార కిట్లు పంపిణీ చేశారు

గొలుగొండ : మండలంలోని రావణాపల్లి అంగన్వాడీ కేంద్రంలో తల్లి పాల వారోత్సవాలలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేశారు. పిఎసిఎస్ అధ్యక్షులు కిలపర్తి పెద్దిరాజు, ఎఎంసి చైర్మన్ కొల్లు సత్యనారాయణ, మాజీ సర్పంచ్ కె.సత్యనారాయణ, మాజీ ఉప సర్పంచ్ కొల్లు రాము, పంచాయతీ సెక్రటరీ ఎస్.అప్పారావు, అంగన్వాడీ టీచర్ నూకరత్నం, ఎం.నూకరాజు, నాగలక్ష్మీ పాల్గొన్నారు. సిహెచ్.నాగాపురం అంగన్వాడీ కేంద్రంలో సర్పంచ్ యలమంచిలి రఘురామచంద్రరావు ఆధ్వర్యంలో తల్లి పాల వారోత్సవాలో గర్భిణులు, బాలింతలకు సంపూర్ణ పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. ఏఎల్‌పురంలో తల్లిపాల వారోత్సవాలపై ర్యాలీ నిర్వహించారు. ఎంపిపి గజ్జలపు మణికుమారి, జిల్లా వైసిపి ఎస్సీ సెల్ అధ్యక్షురాలు, గ్రామ సర్పంచ్ లోచల సుజాత, అంగన్వాడీలు, ఆయాలు పాల్గొన్నారు.

మునగపాక రూరల్ : మండలంలోని చూచుకొండ, గణపర్తి గ్రామాల్లోని అంగన్వాడీ కేంద్రాలలో శనివారం విజయ వాహిని చారిటబుల్ ఫౌండేషన్, టాటా ట్రస్ట్, ఏసియన్ పెయింట్స్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. "తల్లిపాలు ముద్దు, డబ్బా పాలు వద్దు" అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కోఆర్డినేటర్ సిహెచ్ భాగ్యలక్ష్మి, అంగన్వాడీ టీచర్లు కె.గంగ భవాని, పి భవాని, కె నాగమణి, ఆదిలక్ష్మి, పోషక సఖి శ్రీ లక్ష్మి, సిహెచ్ లీల పాల్గొన్నారు.

అచ్యుతాపురం : మండంలోని అరిపాలెం గ్రామంలో తల్లులు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు ర్యాలీ చేశారు. విజయవాహిని చారిటబుల్ ఫౌండేషన్ మరియు టాటా ట్రస్ట్, ఏషియన్ పెయింట్స్ వారి ఆధ్వర్యంలో హరిపాలెంలో తల్లిపాలు వారోత్సవం నిర్వహించారు. బ్లాక్ కోఆర్డినేటర్ ఎం హారిక, అంగన్వాడీ టీచర్లు కేఎల్ఎస్ లక్ష్మీనారాయణమ్మ, పి సావిత్రి, పోషణ సఖి ఎల్లపు సంతోష్ కుమారి పాల్గొన్నారు.



పౌష్టికాహార కిట్లు పంపిణీ చేస్తున్న సాయం రమేష్ తదితరులు

వడ్డాది : బుచ్చయ్యపేట మండలం లోపూడి-2, బంగారు మెట్ట, మంగళపురం, విజయరామరాజుపేట, వడ్డాది తదితర అంగన్వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహార కిట్లును శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కో-ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షులు సాయం రమేష్ మాట్లాడుతూ పౌష్టికాహారం నేరుగా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు నేరుగా అందజేయాలని ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ మెరుగు కుమారి బాబురావు, కంటే వెంకట పద్మరేఖ, ఎంపీటీసీ యల్లపుపు జగ్గారావు, అంగన్వాడీ కార్యకర్తలు రాధా, లక్ష్మి, జ్యోతి, కుసుమ, అమ్మాజీ, వరహాలమ్మ, లబ్ధిదారులు పాల్గొన్నారు

సబ్బవరం : మండలంలోని అంతకాపల్లి, మొగలిపురం, అదిరెడ్డి పాలెం గ్రామాల్లో వైఎస్సార్ సంపూర్ణ పోషకాహార కిట్లు శనివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో అంతకాపల్లిలో సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి, వైస్ ఎమ్‌పిపి చొక్కాకుల గోవింద్, వైసిపి నాయకులు యడ్ల నాయుడు, కోటాన రాము, ఎంపీటీసీ బైలపూడి దేముడు బాబు పాల్గొన్నారు.

బదిలీ టీచర్లకు జీతాలు చెల్లించాలని ధర్నాలు

ప్రజాశక్తి- అనకాపల్లి: రాష్ట్రవ్యాప్తంగా బదిలీలైన 55 వేల మంది ఉపాధ్యాయులకు తక్షణమే రెండు నెలల జీతాల బకాయిలు చెల్లించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శనివారం తహశీల్దారు కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. స్థానిక నర్సింగరావుపేటలోని ఏపిటిఎఫ్ కార్యాలయం నుంచి తహశీల్దారు కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ గంగాధర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నగిరెడ్డి సన్యాసినాయుడు మాట్లాడుతూ జీతాలు చెల్లించకపోవడంతో ఇంటి అద్దెలు, నిర్వహణ వ్యయం, నెలవారి చెల్లించాల్సిన ఈఎంఐలు చెల్లించలేక ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందుల పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.సంఘం నాయకులు సూరేష్, మళ్ళ బాపు నాయుడు, కిరీటీ, టి విజయ్ కుమారి, వాణి, ప్రసాద్, ప్రకాష్, జయలక్ష్మి, రేవతి, సౌజన్య పాల్గొన్నారు.

దేవరాపల్లి : ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వ నిర్లక్ష్య విధానాన్ని నిరసిస్తూ ఏపిటిఎఫ్ స్థానిక తహశీల్దారు కార్యాలయం వద్ద శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. తహశీల్దారు ఎం.లక్ష్మికి వినతిపత్రం అందజేశారు. చెన్నుపాటి మంజుల, కె.భానుమూర్తి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : ప్రభుత్వం ఉపాధ్యాయుల మీద కక్షగట్టి రకరకాలుగా ఇబ్బందులకు గురి చేయడమే కాకుండా, సకాలంలో జీతాలు కూడా చెల్లించ కుండా ఆర్థికంగా



మాడుగులో ఆందోళన చేస్తున్న ఉపాధ్యాయులు

ఇబ్బందులకు గురి చేస్తుందని ఏపిటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్ దుర్గాప్రసాద్ అన్నారు. శనివారం స్థానిక మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. నాయకులు సిహెచ్.మధుకృష్ణ, వెంకటరమణ, ఆర్ సత్యనారాయణ, లక్కోజు శ్రీనివాసరావు, హరికృష్ణ, రామలక్ష్మి, కాసులక్ష్మి, సూర్యనారాయణ పాల్గొన్నారు.

నక్కపల్లి : రీ అపోర్షన్ ద్వారా బదిలీ అయిన ఉపాధ్యాయులకు వెంటనే జీతాలు చెల్లించాలని ఎపిటిఎఫ్ మండల శాఖ అధ్యక్షులు దాడి శెట్టి కొండలరావు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక తహసిల్దార్ కార్యాలయం వద్ద ఎపిటిఎఫ్ ఆధ్వర్యంలో జీతాలు చెల్లింపులో ఆలస్యంపై ప్రభుత్వ తీరును వ్యతిరేకిస్తూ ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. వెంటనే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు .అనంతరం తహసీల్దార్ అంబేద్కర్ కు వినతిపత్రం అందజేశారు కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం నేతలు చొక్కా అప్పలరాజు, ఏడిద కృష్ణ , పాల్గుణరావు,రంగబాబు, వెంకటరావు,రాజేష్, సురేష్ , పి.సురేష్ రవి, జగదీష్, సతీష్,శివ, నాగేశ్వరరావు, చంద్రరావు పాల్గొన్నారు.

మాడుగుల : పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల వేతనాలు, ఇతర సమస్యలు పరిష్కరించాలని శనివారం రెవెన్యూ కార్యాలయం వద్ద ఎపిటిఎఫ్ అధ్వర్యంలో ఉపాధ్యాయులు నిరసన చేపట్టారు.జూన్ నెలలో బదిలీ, ప్రమోషన్ పొందిన ఉపాధ్యాయులకు వేతనాలను చెల్లించడం లేదన్నారు. తక్షణమే వేతనాలను చెల్లించాలని కోరారు. ఎపిటిఎఫ్ .మండల శాఖ అధ్యక్షులు బంగారయ్య, కార్య దర్శులు శివ కుమార్, సూర్యనారాయణ పాల్గొన్నారు

కోటవురట్ల : బదిలీ, ప్రమోషన్ పొందిన ఉపాధ్యాయులకు జూన్ నెల నుంచిసజీతాలు చెల్లించడం లేదని, తక్షణమే వారి సమస్యలను పరిష్కరించాలని ఎపిటిఎఫ్ నేతలు కోరారు. శనివారం తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టిన ఉపాధ్యాయులు తహశీల్దార్ జానకమ్మకు వినతి పత్రం అందజేశారు. సంఘ అధ్యక్షులు కృష్ణ ప్రసాద్, కార్యదర్శి లచ్చబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గొలుగొండ :ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు, రీఅపోర్షన్ ద్వారా సర్దుబాటు జరిగిన ఉపాధ్యాయుల జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ శనివారంఎపిటిఎఫ్ ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఏపిటిఎఫ్ నేతలుఉపాధ్యాయులు పాల్గొన్నారు

ఆయిల్ పామ్ తోటల విస్తరణ మహోత్సవం



ఆయిల్ పామ్ మొక్కలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గణేష్

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : ఆయిల్‌పామ్ సాగుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న ప్రోత్సాహకాలను అందిపుచ్చుకుని ఆయిల్‌పామ్ సాగును విస్తరించాలని ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ అన్నారు. శనివారం నర్సీపట్నం మండలం, గురందరపాలెం గ్రామంలో కె.పద్మావతి పొలంలో ఆయిలుపామ్ తోటల విస్తరణ మహోత్సవాలు నిర్వహించారు. ఉద్యానవనాల అభివృద్ధిలో భాగంగా హార్టీకల్చర్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమంలో ఎమ్మెల్యే గణేష్ రైతులకు ఆయిల్‌పామ్ మొక్కలను పంపిణీ చేశారు.

ఎంపిపి సుర్ల రాజేశ్వరి మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగుపై ఉద్యానవనశాఖ, పతంజలి కంపెనీ నిర్వహించే శిక్షణను ౦ రైతులు వినియోగించుకోవాలని, ఆయిల్ పామ్ సాగులో మంచి దిగుబడులు సాధించాలని సూచించారు. ఉద్యానశాఖ అధికారిణి శిరీష మాట్లాడుతూ ఈప్రభుత్వం ద్వారా మొక్కలు, ఎరువులు, అంతర పంటల మొక్కలు రాయితీల గురించి వివరించారు. పతంజలి కంపెనీ డీజీఎం రవీంద్ర మాట్లాడుతూ జిల్లాలో, 2976 మంది రైతులు 3517 హెక్టార్లులో పామాయిల్ సాగు చేస్తున్నారని,2021–23 సీజన్లో 31వేల టన్నుల ఆయిలుపామ్ గెలలను సప్లై చేశారన్నారు. పతంజలి కంపెనీ మేనేజర్ తోట చంద్రశేఖర్, ఎంపిడిఒ జయమాధవి, ఉద్యానవన,వ్యవసాయశాఖ, పతంజలి సిబ్బంది పాల్గొన్నారు.

ఉపమాక వెంకన్న ఆలయంలో అన్నసమారాధన

ప్రజాశక్తి -నక్కపల్లి : ప్రసిద్ధి పుణ్యక్షేత్రం ఉపమాక వెంకన్న ఆలయం శనివారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు భక్తుల గోత్రనామాలతో పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ ప్రధాన అర్చకులు గొట్టుముక్కల ప్రసాదాచార్యులు పర్యవేక్షణలో దాతల సహకారంతో ప్రతి శనివారం ఆలయానికి వచ్చే భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేస్తున్నారు. దీనిలో భాగంగా శనివారం సుమారుగా 500 మంది భక్తులకు ఆలయ ప్రాంగణంలో అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు.కార్యక్రమంలో ఆలయ అర్చకులు సంకర్షణ పల్లి కృష్ణమాచార్యులు, పీసపాటి శేషాచార్యులు, భాగవతం సాయి గోపాలాచార్యులు పాల్గొన్నారు.

ఓటరు సర్వేలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ప్రజాశక్తి- నక్కపల్లి: ఇంటింటా ఓటరు సర్వేలో బూత్ లెవెల్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని పాయకరావుపేట నియోజకవర్గం ఎలక్టోరల్ రిటర్నింగ్ అధికారిణి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కెవి. రామలక్ష్మి హెచ్చరించారు. శనివారం మండల పరిషత్ సమావేశ మందిరంలో బిఎల్ఒలతో సమావేశం నిర్వహించారు .సమావేశానికి కొందరు ఆలస్యంగా రావడం, మరికొందరు సెలవు పెట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల విధులు పట్ల నిర్లక్ష్యంగా ఉంటే ఎలాగని ప్రశ్నించారు. ఫారం 6,7,8లకు సంబంధించిన అంశాలను. నింపే విషయంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై బిఎల్ఒలను ప్రశ్నించగా, సరైన సమాధానం చెప్పకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు తహసీల్దార్ అంబేద్కర్, ఎంపిడిఒ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చీడికాడ : కొత్త ఓటర్ల నమోదు వేగవంతం చేయా నియోజవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, స్పెషల్



బిఎల్ఒలతో మాట్లాడుతున్న ఇఆర్ఒ రామలక్ష్మి

డిప్యూటీ కలెక్టర్ అనిత కోరారు శనివారం చీడికాడ మండల పరిషత్ కార్యాలయంలో ఓటర్ల జాబితా సర్వేపై బిఎల్ఒలతో సమీక్షించారు.ఈ నెల 21 వరకు ఓటర్ నమోదు.సవరణకు అవకాశం ఉందని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బిఎల్ఒలు బాధ్యతగా ఓటర్ల జాబితా సవరణ చేపట్టాలన్నారు . తహశీల్దార్ బివి రాణి, ఇఒపిఆర్‌డి కామేశ్వరరావు పాల్గొన్నారు

5 వేల మొక్కల నాటివేత

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలోని లింగంపేట పంచాయతీ శ్రీనూకాలమ్మ తల్లి దేవాలయ భూమి 15 ఎకరాలలో సోషల్ ఫారెస్ట్ ఆధ్వర్యంలో శనివారం వేప, కొబ్బరి, రాగి జాపర్ మొదలైన 10 రకాల ఐదువేల మొక్కలను నాటారు. జెడ్‌పిటిసి సుర్ల గిరిబాబు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మొక్కలునాటి, వాటిని సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిపి గజ్జలవు మణికుమారి, సర్పంచ్ సంతోష్‌కుమార్, ఆలయ కమిటీ చైర్మన్ బొండల నూకరత్నం, పార్టీ మండల అధ్యక్షులు లెక్కల సత్యనారాయణ, వైస్ ఎంపిపి సుర్ల బాబ్జి, బిసి కార్పొరేషన్ డైరెక్టర్ బొండల రాజు, సర్పంచ్ పత్తి రమణ, సోషల్ ఫారెస్ట్ ఆఫీసర్ భాగ్య, గ్రామ వైసిపి నాయకులు జి.త్రిమూర్తులు, నాని, కవి, మంగరాజు, గణేష్, శివ, మల్లేశ్వరరావు, రాజుబాయ్ పాల్గొన్నారు.

10న డీవార్మింగ్ డేను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి -నక్కపల్లి : ఈనెల 10న డీ వార్మింగ్ డేను విజయవంతం చేయాలని ఎంపిడిఒ శ్రీనివాసరావు అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో గొడిచెర్ల పిహెచ్‌సి వైద్యాధికారి సుకన్య ఆధ్వర్యంలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవానికి సంబంధించి కరపత్రాలు, వాల్ పోస్టర్లు ను ఆవిష్కరించారు. డీవార్మింగ్ మాత్రలను వైద్య సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగా .మండలంలో 15422 మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేయాలని లక్ష్యం పెట్టుకున్నట్లు వైద్యాధికారి సుకన్య తెలిపారు ఇఒపిఆర్‌డి వెంకటనారాయణ, ఎఒ సీతారామరాజు, ఎంఇఒ నరేష్ , సిడిపిఒ శ్రీవిద్య , వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు .

కోటవురట్ల : ఈ నెల 10న డీవార్మింగ్ డే సందర్భంగా విద్యార్థులందరికీ ఆల్బెండజోల్ మాత్రలు అందజేయాలని ఎంపిడిఒ కాశీ విశ్వనాథరావు సూచించారు. శనివారం మండల సమావేశ మందిరంలో ఆరోగ్య విస్తరణాధికారి గోవిందరావు వైద్య సిబ్బంది,అంగన్వాడి , పాఠశాల సిబ్బందికి మాత్రలు అందజేశారు. ఎంఇఒ రామారావు, ఇఒపిఆర్‌డి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

మాడుగుల: జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం పురస్కరించుకుని శనివారం ఆల్బెండజోల్ మాత్రల పంపిణీని ప్రారంభించారు. ఎంపిపి పెదబాబుకు కెజె.పురం పిహెచ్‌సి వైద్యులు ప్రసాద్‌పాత్రుడు మందులు అందించారు. పిహెచ్‌సి పరిధిలో 32 పాఠశాలలు, రెండు కళాశాలల్లోని 6500



గొలుగొండలో పోస్టర్ల ఆవిష్కరణ

మంది విద్యార్థులకు ఈ నెల 10న వీటిని పంపిణీ చేసి మింగించనున్నారు.

కశింకోట : ఈ నెల 10న నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు పంపిణీ చేసేందుకు శనివారం కసింకోట మండలంలో అన్ని పాఠశాలలకు నులిపురుగుల నివారణ మాత్రలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్‌పిడిఒ రవికుమార్, సర్పంచ్ కలగా గున్నయ నాయుడు, ఎంఇఒలు చిట్టిబాబు, సూర్యనారాయణ మూర్తి, వైద్య ఆరోగ్య విస్తరణ అధికారి సత్యనారాయణ, రామ్మూర్తి, శివ, సిబ్బంది పాల్గొన్నారు.

అచ్యుతాపురం : మండల పరిషత్ కార్యాలయంలో శనివారం 14వేల ఆల్బెండజోల్ మాత్రలను ఎంపీడీవో విజయలక్ష్మి, వైద్యాధికారి రజని, అలేఖ్య చేతుల మీదుగా పాఠశాలలకు పంపిణీ చేశారు. వైసిపి నాయకులు కోన లచ్చన్న నాయుడు, పీహెచ్సీ సామాజిక ఆరోగ్య అధికారి వేణు గోపాల్, వైద్య సిబ్బంది లండా అప్పలకొండ పాల్గొన్నారు.

పరవాడ : స్థానిక తహశీల్దారు కార్యాలయంలో మండలంలో ఉన్న అన్ని పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలకు ఆల్బెండజోల్ మాత్రలు పరవాడవాడ, చీపురుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు ఆధ్వర్యంలో శనివారం ఎంపీడీఓ హేమసుందర్ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ కనకరాజు, పరవాడ, వాడ చీపురుపల్లి వైద్య అధికారులు డాక్టర్. రంజిత్, డాక్టర్. కనకప్పరావు సిహెచ్ఓ ఎంఎన్ఎస్. సాయిరాం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గొలుగొండ :ఈ నెల 10న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పోస్టర్లను ఆవిష్కరించి మందులను అందజేశారు. పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ వాసు, ఈఒపిఆర్‌డి రఘురాం, పరిపాలనాధికారి బొంతు సత్యనారాయణ పాల్గొన్నారు.

రోలుగుంట: ఈ నెల 10న ప్రపంచ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని అన్ని పాఠశాలల్లో, అంగన్వాడీ సెంటర్లలో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మందులు పంపిణీ చేస్తున్నట్లు డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్ఒ కె.వీరాజ్యోతి తెలిపారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిధిలోని అధ్యాపకులు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశ వర్కర్లు, పిల్లల తల్లిదండ్రులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ప్రభాకర్, స్థానిక వైద్యాధికారి డాక్టర్ ధనలక్ష్మి, ఉపాధ్యాయులు, హెల్త్ వర్కర్లు, ఆశలు పాల్గొన్నారు.

ముగ్గురిపై కేసు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : ఈ నెల 3న అర్ధరాత్రి శివపురంలోని ఎస్‌సి, ఎస్‌టి బాలుర హాస్టల్‌లో దుర్గాప్రసాద్ అనే డిగ్రీ ఫస్టియర్ విద్యార్థిపై దాడి చేసిన యువకులపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సిఐ గణేష్ తెలిపారు.బాధిత విద్యార్థి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం శారదానగర్‌కు చెందిన భీమిరెడ్డి హర్షవర్ధన్,.బిసి కాలనీకి చెందిన చిటికల దుష్యంత్‌పై కేసు నమోదు చేసినట్టు తెలిపారు. ఈ ఘటనలో ముగ్గురు యువకులు పాల్గొనగా, ముగ్గిరి స్మార్ట్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

'అన్యాయంగా విధుల నుంచి తొలగించారు'

ప్రజాశక్తి- నక్కపల్లి : మండలంలోని ఉద్దండపురం సచివాలయంలో వాలంటీర్లుగా విధులు నిర్వహిస్తున్న తమను పంచాయతీ కార్యదర్శి నాగరాజు అన్యాయంగా తొలగించారని వాలంటీర్లు కొంతం దివ్య , బండాడ అనంతలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ శ్రీనివాసరావుకు ఫిర్యాదు పత్రం అందజేశారు. బాధ్యతగా విధులు నిర్వహించడం వల్ల మూడేళ్ల తమకు సేవా మిత్ర ప్రోత్సాహకం ద్వారా వచ్చిన రూ.పది వేలలో చెరో రూ.ఐదు వేలను ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శి డిమాండ్ చేశారని, ఇవ్వకుంటే ఉద్వాసన తప్పదని హెచ్చరించారన్నారు. అన్నట్లుగానే గతనెల 31న తమను విధుల నుండి తొలగిస్తున్నట్లు వాట్సాప్ మెసేజ్ పంపించారన్నారు. తమకు న్యాయం చేయాలని కోరారు. ఇఒపిఆర్‌డి వెంకటనారాయణ, ఎఒ సీతారామరాజు ఉన్నారు .

ఘనంగా ఎఫ్ కప్ బ్యాడ్మింటన్ టోర్నీ

స్నేహితుల దినోత్సవం సందర్భంగా పోటీలు



బహుమతులతో బ్యాడ్మింటన్ క్రీడాకారులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : స్నేహితుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఎఫ్ కప్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ పోటీలు శనివారం స్వర్ణభారతి స్టేడియంలో ఉత్సాహపూరిత వాతావరణంలో ముగిశాయి. ఈ పోటీల్లో మధురవాడ మొగల్స్, సూపర్ జాక్స్, మాస్టర్స్ బ్లాస్టర్స్, సైలెంట్ కిల్లర్స్, నెట్ నింజాస్, రైడర్స్ జట్లు పాల్గొన్నాయి. తుదకు మధురవాడ మొగల్స్ విన్నర్‌గా, సూపర్ జాక్స్ రన్నర్‌గా నిలిచాయి. మధురవాడ మొగల్స్‌లో సభ్యులుగా సబ్ రిజిస్ట్రార్ మోహన్, భామ బోటిక్యూ ఉమా, ఆర్ఆర్ కేబుల్స్ హరి, మోహన్ కృష్ణ ఉండగా, సూపర్ జాక్స్‌లో డాక్టర్ ఆదిత్య, డాక్టర్ కృష్ణ రెడ్డి, విజయనగర పౌల్ట్రీస్ మేనేజింగ్ డైరెక్టర్ సుధాకరరెడ్డి, రియల్టర్ జగన్ సభ్యులుగా ఉన్నారు. పోటీల ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న43వ వార్డు కార్పొరేటర్, అంతర్జాతీయ బాడ్మింటన్ క్రీడాకారిణి ఉషశ్రీ, డిస్ట్రిక్ట్ బాడ్మింటిన్ కార్యదర్శి చుక్క శ్రీనివాస్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ హరిప్రసాద్ విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

రోడ్డు నిర్మించే వరకు దీక్ష విరమించం



దీక్షలో పాల్గొన్న అణుకు గిరిజనులు

ప్రజాశక్తి -కోటవురట్ల : అణుకు గిరిజన గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించే వరకు దీక్ష విరమించేంది లేదని అణుకు గ్రామ గిరిజనులు స్పష్టం చేశారు. శనివారం 30వ రోజు దీక్షలో భాగంగాగిరిజనులు భిక్షాటన చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న సిపిఎం జిల్లా కార్యవర్గసభ్యులు అప్పలరాజు మాట్లాడుతూ ఆదివాసీల సమస్యలపై ప్రభుత్వం అధికార యంత్రాంగం ఇంత నిర్లక్ష్యధోరణితో వ్యవహరించడం దారుణమన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 75ఏళ్లు గడచినా కనీస సౌకర్యాల కోసం మన్యవాసులు ఆందోళన చేపట్టే పరిస్థితి రావడం దానికి అధికారులు, నేతలు స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో డేవిడ్ రాజు, సూరిబాబు, రమేష్ పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టళ్లకు పోలీసు భద్రత కల్పించాలి

ప్రజాశక్తి- నర్సీపట్నం : సంక్షేమ హాస్టల్స్ వద్ద పోలీసు పెట్రోలింగ్ క్యాంప్‌లలు నిర్వహించాలని సిపిఎం జిల్లా పార్టీ కమిటీ సభ్యులు అడిగర్ల రాజు డిమాండ్ చేశారు. శనివారం విలేకర్లతో మాట్లాడుతూ ఈ నెల 3న గిరిజన బాలుర హాస్టల్ వద్ద కొందరు మద్యం మత్తులో హాస్టల్‌లోకి చొరబడి ఎల్.ఆశోక్ అనే ఇంటర్ విద్యార్థిని బ్లేడుతో గాయపరిచాడన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే హాస్టళ్ల వద్ద పోలీసుల భద్రత అవసరమన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు, నాయకులు సాపిరెడ్డి నారాయణమూర్తి, ఈరెల్లి చిరంజీవి పాల్గొన్నారు.

దాడి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలి

నర్సీపట్నం టౌన్ : నర్సీపట్నం సంక్షేమ హాస్టల్‌లో విద్యార్థులపై ఈ నెల 3న జరిగిన దాడి వంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని ఎస్ఎఫ్ఐ నేతలు కోరారు. ఈ మేరకు ఆర్‌డిఒ కార్యాలయంలో వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా సెక్రెటరీ ఎస్ రమణ ఎం ప్రసాద్, డి దినేష్, సాయి మాట్లాడుతూ సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు రక్షణ లేకుండా పోయిందని, అల్లరి మూకలు ఇష్టారాజ్యంగా హాస్టల్‌లోకి చొరవడి దాడులు చేస్తున్నారన్నారు.విద్యార్థులకు పోలీసు రక్షణ కల్పించాలని కోరారు.

టిడ్కో ఇళ్లను తక్షణమే పంపిణీ చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం - ఇళ్లను పరిశీలించిన నాయకులు



టిడ్కో ఇళ్లను చూపిస్తున్న లోకనాథం, ఇతర సిపిఎం నేతలు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : నర్సీపట్నం మున్సిపాలిటీ పరిధిలోని టిడ్కో ఇళ్లను తక్షణమే పంపిణీ చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కె. లోకనాథం డిమాండ్ చేశారు. శనివారం బలిఘట్టంలోఉన్న టిడ్కో ఇళ్లను సిపిఎం కార్యదర్శి వర్గ సభ్యులు జి. కోటేశ్వరరావు, సీనియర్ నాయుకులు కె. త్రిమూర్తులు రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు అడిగర్ల రాజు, ఈరెల్లి చిరంజీవిలతో కలిసి సందర్శించి, నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ నర్సీపట్నం మున్సిపాలిటీ పరిధిలో 2500 మంది లబ్ధిదారుల నుండి డిడిలు కట్టించుకుని, దరఖాస్తులును తీసుకొని, ఏళ్లు గడుస్తున్నా నేటికి ఇళ్లు పంపిణీ చేయకపోవడం అన్యాయమన్నారు. ఆగస్టు నాటికి టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందజేస్తామన్న ముఖ్యమంత్రి జగన్ హామీకూ నేటికీ కార్యరూపం దాల్చలేదన్నారు. టిడ్కో ఇళ్ల పంపిణీలో జాప్యంలో అంతర్యమేమిటని ప్రశ్నించారు. తక్షణమే ఇళ్లు పంపిణీ చేయకుంటే లబ్ధిదారులతో తామే గృహప్రవేశాలను నిర్వహిస్తామన్నారు.

జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

అనకాపల్లి: అనకాపల్లి మండలంలోని సత్యనారాయణపురంలోని జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఆర్.శంకరరావు, గంటా శ్రీరామ్, సీనియర్ నాయకులు ఎ.బాలకృష్ణతో కలిసి శనివారం ఆయన జగనన్న కాలనీలో వసతుల పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ జగనన్న కాలనీలో కాలువలు, తాగునీరు, రహదారి, కమ్యూనిటీ హాల్, పార్కు సౌకర్యం వెంటనే కల్పించాలన్నారు. జగనన్న గృహాలకు ప్రభుత్వం ఇచ్చే రూ.1.80 లక్షలు సరిపోక లబ్ధిదారులు అప్పులపాలవుతున్నారన్నారు. ఇంటి నిర్మాణానికి పది లక్షల రూపాయలు ఖర్చవుతున్నట్లు లబ్ధిదారులు చెబుతున్నారని తెలిపారు. ఇంటి నిర్మాణ ఖర్చులను దృష్టిలో పెట్టుకొని ప్రతి ఇంటి నిర్మాణానికి రూ.ఐదు లక్షలు చొప్పున లబ్ధిదారునికి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కార్పొరేట్ స్థాయిలో గ్రంథాలయాల అభివృద్ధి



గ్రంథాలయపరిషత్ చైర్మన్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే గణేష్

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ :విద్యా వ్యవస్థలో కార్పొరేట్ స్థాయి మార్పులు తీసుకొచ్చినట్లుగానే, విజ్ఞాన వ్యవస్థ గ్రంథాలయాలకు కార్పొరేట్ సొబగులు అద్దానలి గ్రంథాలయాల పరిషత్ రాష్ట్ర చైర్మన్ మందపాటి శేషగిరిరావు అన్నారు. శనివారం స్థానిక శాఖా గ్రంథాలయంలో 'మనం మన గ్రంథాలయాలు' కార్యక్రమంలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గ్రంథాలయ వ్యవస్థలో నూతన వరవడి సృష్టిస్తున్నారని. గ్రంథాలయాలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దాలని చూస్తున్నారన్నారు. గ్రంథాలయాలను టెక్నాలజీని అనుసంధానించి, డిజిటల్ లైబ్రరీలుగా మార్చుతున్నారన్నారు. గ్రామస్థాయిలో డిజిటల్ లైబ్రరీ వ్యవస్థ ఏర్పాటుతో, నిరాధారణకు గురైన గ్రంథాలయ వ్యవస్థను పునరుజ్జీవింపజేసి, ప్రజలకు, విద్యావంతులకు, గ్రంథాలయాలు చేరువయ్యాలా చేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి చొరవతో ఇప్పటికే గ్రంథాలయాలకు రూ. 100 కోట్ల నిధులు ఇచ్చారని వాటితో గ్రంథాలయాలను ఆధునికరిస్తున్నామన్నారు.

ప్రతినెలా మొదటి శనివారం రాష్ట్రంలోని అన్ని గ్రంథాలయాల్లో "మనం - మన గ్రంథాలయం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. శాఖా గ్రంథాలయాన్ని పాఠకులకు మెరుగైన సేవలు అందించేలా తీర్చిదిద్దిన లైబ్రేరియన్ దమయంతిని అభినందించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొండా రమాదేవి, వైసిపి అధికార ప్రతినిధి రాజీవ్‌గాంధీ, పార్టీ అధ్యక్షులు ఏకశివ, వరలక్ష్మి, లగుడుస్వామి, యాదగిరి శేషు, జి.మురళీకష్ణ, వరహామణి పాల్గొన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధికి సహకారం : ఎమ్మెల్యే

గ్రంథాలయాల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ అన్నారు. మున్సిపాలిటీ నుండి గ్రంథాలయ సెస్ చెల్లింపునకు చొరవ చూపిస్తామన్నారు. గ్రంథాలయ పరిషత్తు రాష్ట్ర చైర్మన్ మందపాటి శేషగిరిరావు, విశాఖపట్నం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొండా రమాదేవి, వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్‌గాంధీ తన క్యాంపు కార్యాలయానికి వచ్చిన సందర్భంగా దుశ్శాలువాతో సత్కరించారు.

అల్లూరిని యువత ఆదర్శంగా తీసుకోవాలి

గొలుగొండ : అల్లూరి సీతారామరాజు ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ ఎం.శేషగిరిరావు అన్నారు. శనివారం మండలంలో కృష్ణదేవిపేట అల్లూరి పార్కును సందర్శించి అల్లూరి, గంటందొరల సమాధులను సందర్శించి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రతినిధి త్రిమూర్తులరెడ్డి పాల్గొన్నారు.

నాన్ షెడ్యూల్డ్ గిరిజనానికి / ఐటిడిఎ సేవలు అందించాలి



పాదయాత్ర చేస్తున్న గిరిజనులు

ప్రజాశక్తి -కొత్తకోట : నాన్ షెడ్యూల్డ్ ఏరియా ఆదివాసీలకు ఐటిడిఎ సేవలు అందాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీల మహాపాదయాత్ర రెండవరోజు శనివారం ఉదయం రావికమతం మండలం కొత్తకోట నుంచి ప్రారంభమైంది. అఖిల భారత గ్రామీణ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పి ఎస్, అజయ్ కుమార్, ఎపీ ఆదివాసీల హక్కుల సాధన కమిటి రాష్ట్ర అధ్యక్షులు నల్లి కల్యాణం ఆధ్వర్యంలో జరుగుతున్న ర్యాలీలో మహాజన సోషలిస్ట్ పార్టీ అనకాపల్లి జిల్లా కన్వీనర్ ఏలుసూరి ఘాటీలు, అఖిల భారత ఆదివాసి సంఘం ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు రేచుకట్ల సింహాచలం మాట్లాడుతూ, పాడేరులోని ఐటిడిఎను అల్లూరి జిల్లాలో ఉండిపోవడంతో అనకాపల్లి జిల్లాలోని నాన్ షెడ్యుల్ ఆదివాసీలకు, వారి భూములు, హక్కులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. అనకాపల్లి కొత్త జిల్లా ఏర్పాటైన తర్వాత ఆదివాసీల భూములను కాజేయడానికి అవినీతి పరులైన కొందరు రెవెన్యూ, పోలీసుఅధికారుల సహకారంతో, పెద్ద ఎత్తున ప్రయత్నాలు జరగడం శోచనీయమన్నారు. చీడికాడ మండలం కోనాం శివారులో ఆదివాసీలు తరతరాలుగా సాగు చేస్తున్న ప్రభుత్వ బంజరు భూముల్లోకి వెళ్ళవద్దని, ఆ భూములకు గిరిజనేతరులకు ఇప్పటికే పట్టాలు ఉన్నాయని తహశీల్దార్‌తో పాటు పోలీస్ అధికారులు గిరిజనులను హెచ్చరిస్తున్నారన్నారు. జిల్లా మారినా పాత జిల్లాలోని ఆదివాసీలకు ఐటిడిఎ పని చేస్తుందని, ఐటిడిఎ ఆవిర్భావ సమయంలో బైలాలో ఉందని, జిల్లా మారినా భౌగోళిక ప్రాంతం మారలేదన్న విషయాన్ని గుర్తుంచాలన్నారు. 4న నర్సీపట్నంలో ప్రారంభమైన పాదయాత్ర 7 న సోమవారం అనకాపల్లి జిల్లా కలెక్టరేట్ వద్ద సభతో ముగుస్తుందని, అన్ని వర్గాల మద్దతు ఇవ్వాలని కోరారు. అనంతరం రావికమతం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు.కార్యక్రమానికి మహాసేన సోషలిస్టు పార్టీ మద్దతు తెలిపింది. ర్యాలీలో పలువురు గిరిజన సంఘం నాయకులు పాల్గొన్నారు..

'ప్రజాశక్తి'ని సందర్శించిన జర్నలిజం విద్యార్థులు



ప్రజాశక్తి ఎడిషన్ కార్యాలయం వద్ద జర్నలిజం విద్యార్థులు

ప్రజాశక్తి - విశాఖపట్నం : ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని రాయ్‌పూర్ ఎఎఎఫ్‌టి యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ (ఎస్ఓజెఎమ్‌సి) విద్యార్థులు శనివారం విశాఖ ఆటోనగర్‌లోని ప్రజాశక్తి విశాఖ ఎడిషన్ కార్యాలయాన్ని సందర్శించారు. మీడియా పనితీరును తెలుసుకున్నారు. 26 మందితో కూడిన ఈ జర్నలిస్టు విద్యార్థుల బృందం ఎస్ఓజెఎమ్‌సి హెచ్ఓడి సోమనాథ్ సాహూ నేతృత్వాన ఇక్కడకు వచ్చింది. వారికి ప్రజాశక్తిలో సాదర స్వాగతం లభించింది. ప్రజాశక్తి ప్రస్థానం, వార్తల సేకరణ, విలేకరుల పనితీరు వంటి అంశాలను ప్రజాశక్తి జనరల్ మేనేజర్ ఎం.వెంకటేశ్వరరావు విద్యార్థులకు తెలియజేశారు. ప్రింటింగ్ యూనిట్ పనితీరు, పత్రిక తయారీ వంటి విషయాలను ప్రజాశక్తి జిల్లా సమన్వయ కమిటీ సభ్యులు వై.సత్యనారాయణ విద్యార్థులకు అర్థమయ్యేలా వివరించారు. మీడియా రంగం పనితీరు, ఇతర అభ్యాసాలపై విద్యార్థుల అవగాహన పెంపుదలకు ఈ సందర్శన ఎంతో తోడ్పడిందని హెచ్ఓడి సోమనాథ్ సాహూ తెలిపారు. ఈ సందర్శన ఆద్యంతం విద్యార్థులు సందడిగా కనిపించారు.